# వివాహసంస్కారము

రచయిత

'విద్యానిధి' డాక్టర్ రాణి రామకృష్ణ

392.5
99526

ప్రకాశకులు
శ్రీ జయలక్ష్మీ పబ్లికేషన్సు
హైదరాబాదు

# వివాహసంస్కారము

రచయిత

'విద్యానిధి' డాక్టర్ రాణి రామకృష్ణ

ప్రకాశకులు

శ్రీ జయలక్ష్మి పబ్లికేషన్సు

హైదరాబాదు

1997

# వివాహసంస్కారము


రచయిత డా రాణి రామకృష్ణ, M A Ph D



ద్వితీయముద్రణ 1997

ప్రతులు వేయి



392 5

C 14025



**Publishers & Copyright Holders .**

శ్రీ జయలక్ష్మి పబ్లికేషన్స్,

3-35, రామాలయం వద్ద,

కూకట్ పల్లి, హైదరాబాదు- 500 072

ఫోన్- 886598

**Distributors**

శ్రీ గోపాల్ పబ్లికేషన్స్,

3-3-860, ఆర్యసమాజ్ మందిర్ సందులో,

కాచిగూడా చౌరస్తా, హైదరాబాదు- 500 027,

ఫోన్ 4658101

**ఆఫ్‌సెట్ ముద్రణ**

శ్రీ కళాంజలి గ్రాఫిక్స్,

విరల్‌వాడి, హైదరాబాదు 500 029

వెల రూ 16/



Acc No 99526

శ్రీ గణేశాయ నమ

శ్రీగురుభ్యో నమ　　　　శ్రీబాలా త్రిపురసుందర్యై నమ.

# ముందుమాట

హిందూధర్మము సనాతనమైనది చరిత్రకందని అనాదికాలమునుండియు ప్రవహించే సంస్కృతియొక్క ప్రవాహమునకే హిందూధర్మమని వాడుక వటవృక్షమువంటి ఈ ధర్మము అనేక ఆరాధనాపద్ధతులను తనలో ఇముడ్చుకుంది కాని, ఈనాడు మనకు ఒక విచిత్రపరిస్థితి గోచరిస్తుంది ఆధునిక ప్రపంచంలో సైన్సు, టెక్నాలజీ మొదలగు ఏ రంగంలోనైనా హిందువులు అగ్రగాములే కాని తమదైన ధర్మము, సంస్కృతుల గురించిన పరిజ్ఞానము చాల తక్కువగా కలిగిన మానవసముదాయము బహుశః ప్రపంచంలో హిందూ సమాజ మొక్కటియేనేమో అనిపిస్తుంది

హిందూవివాహము పరమపవిత్రమైన సంస్కారము ఏకపత్నీవ్రతధర్మాన్ని ప్రపంచానికి చాటిన శ్రీరామచంద్రుడు హిందూసమాజానికి స్ఫూర్తిదాత, ఆరాధ్యదైవము కాని ఈనాటి విద్యావంతులైన యువకుల్లో కొంతవరకు పెద్దలలో కూడా, వివాహప్రయోగంలోని వేర్వేరు అంశాలపై సరైన అవగాహన లేకపోవడం తరచుగా గోచరించే సత్యం ఈస్థితిలో అట్టి అవగాహనను కొంతవరకు కల్గించుటకొరకై ఈ చిన్నిపొత్తము ఉద్దేశింపబడింది తపస్స్వాధ్యాయనిరతులు, అక్రోధనులు, పున్నాలుగారు అనే పేరుతో ప్రఖ్యాతిగాంచిన బ్రహ్మశ్రీ కొంపెల్ల కామేశ్వరఘనపాఠీ గారివద్ద కృష్ణయజుర్వేదంతోపాటు, కొంత స్మార్తాన్ని అభ్యసించే భాగ్యం నాకు కలిగింది వారి ఆశీస్సు అనుగ్రహమే నా అర్హత ఆప్తమిత్రులు, శ్రేయోభిలాషులు, ఆస్తికవరేణ్యులు నగు బ్రహ్మశ్రీ పి. శివరామన్‌గారు వారి ధర్మపత్ని శ్రీమతి విశ్వేశ్వరి గార్ల ప్రోత్సాహమే ఈప్రయత్నానికి ఆలంబనం

పరమపూజనీయ బ్రహ్మశ్రీ Dr P శ్రీరామచంద్రుడుగారు నాకు ఆప్తతములు, నన్ను అన్నివేళలా ప్రోత్సహించేవారు నేను కోరినదే తడవుగా అభినందన వ్రాసి యిచ్చేరు వారి పాదపద్మములకు నా ప్రణామములు వివాహప్రయోగంలో నాకు అనుభవములేని కారణంగా, ఏమైన దోషాలు ఉన్నచో పెద్దలు మన్నించమని ప్రార్థిస్తున్నాను దోషములను నాకు తెలిపినచో మలిముద్రణలో సరిచేసుకుంటాను పరమశ్రద్ధేయులు, గురుదేవులు, కీర్తిశేషులు నగు బ్రహ్మశ్రీ పున్నాలు అవధానిగారి పాదపద్మములకు మనసా వందన మాచరించి, ఈ కృతిని సవినయముగా వారి దివ్యస్మృతికి అంకితం చేస్తున్నాను

ఇట్లు
బుధజనవిధేయుడు
**రాణి రామకృష్ణ**

# విషయ సూచిక

**విషయము** **పుట**


వివాహ సంస్కారము (ప్రస్తావన) ........ 1
గణాధిపతి పూజ ........ 4
పుణ్యాహవాచనము ........ 6
సమావర్తనము లేక స్నాతకము ........ 9
అంకురారోపణము ........ 14
వధూగృహగమనము ........ 17
మధుపర్కము ........ 19
మహాసంకల్పము ........ 21
కన్యాదాన మాహాత్మ్యము ........ 25
కన్యాదానము ........ 27
సుముహూర్తము ........ 29
వధూసమీక్షణము ........ 31
పవిత్రజలములతో వధువును అభిషేకించుట ........ 32
యోక్త్రబంధనము ........ 34
మంగళసూత్రధారణము ........ 34
అక్షతారోపణము ........ 36
మహదాశీర్వచనము ........ 38
ప్రధానహోమము ........ 39
పాణిగ్రహణము ........ 40
సప్తపది ........ 41
అశ్మారోహణము ........ 45
లాజహోమము ........ 45
యోక్త్రవిమోచనము ........ 46
వధువు వరుని గృహమునకు వెళ్లుట ........ 47
వధూ గృహప్రవేశము ........ 49
ప్రవేశహోమము ........ 50
నక్షత్రదర్శనము ........ 52
ఆగ్నేయస్థాలీపాకము ........ 54
శేషహోమము ........ 55
నాకబలి ........ 57
ఉపయుక్త గ్రంథసూచి ........ 60

శ్రీః

# అభినందనము

వేదాంతశిరోమణి, వేదాంతవిశారద, విద్వాన్
డా పి శ్రీరామచంద్రుడు
M A Ph D (Skt), M A (Eng), M A (Hindi)
రాష్ట్రపతి అవార్డు గ్రహీత
ప్రొఫెసర్ (సంస్కృతము) (రిటైర్డు)

ఈ ప్రపంచసృష్టి అంతా భగవంతుడు మానవుని కోసమే చేశాడనీ, అందుచేత ఇతరప్రాణుల కష్టసుఖాలతో ఏమాత్రమూ పనిలేకుండా ఏదోవిధంగా తన మట్టుకు తాను సుఖంగా ఉండడంకోసం ప్రయత్నం చేసుకోవడమే మానవుని ఏకైక కర్తవ్యమనీ వైదికధర్మం అంగీకరించదు ఈ ప్రపంచంలో ఉన్న అనేక లక్షలవిధాలైన ప్రాణికోటులలో మానవుడు కూడా ఒకడు ఈ ప్రపంచకంమీద మానవునికి ఎంత అధికారం ఉందో ప్రతిప్రాణికీ అంత అధికారం ఉంది అయితే బుద్ధిబలంవంటి కొంత వైశిష్ట్యం మానవునిలో ఉంటే ఉండవచ్చు ఈ మానవుడు మానవత్వం లభించడానికి పూర్వం ఎన్నెన్ని అవతారాలు ఎక్కడెక్కడ ఎత్తాడో, ముమ్ముందు ఏయే అవతారాలు ఎత్తవలసి ఉందో ఎవరికి తెలియదు. అందుచేత నీచేతిలో ఉన్న ఈ కొద్ది సంవత్సరాల అల్పకాలాన్నీ నీ పురోభివృద్ధికి ఉపయోగించేటట్లుగా జాగర్తగా ఉపయోగించుకోమని చెపుతోంది వైదికధర్మం ఈ దృష్టితో విధించినదే ఆశ్రమధర్మం అనేది అంటే జ్ఞానం వచ్చినది మొదలు చివరి క్షణంవరకూ ఒక ఉన్నతాదర్శాన్ని దృష్టిలో పెట్టుకొని జీవితకాలం ఒక టైంటేబిల్ ప్రకారం నడవాలని అర్థం

"చతుర్థమాయుషో భాగముషిత్వాద్యం గురోః కులే।
ద్వితీయమాయుషో భాగం కృతదారో గృహే వసేత్

వనేషు చ విహృత్యైవం తృతీయం భాగమాయుషః ।
చతుర్థమాయుషో భాగం త్యక్త్వా సంగాన్ పరివ్రజేత్ ॥"

అని మనుస్మృతి చెపుతూన్నది ఆయుర్దాయాన్ని నాలుగు భాగాలుగా చేసి ఒక్కొక్క భాగం ఒక్కొక్క ఆశ్రమానికి వినియోగించాలని దీని భావం అందుచేత మానవుని పురోభివృద్ధికి గాని, ఆధ్యాత్మిక సమున్నతికి గాని సంబంధించినంతవరకు అన్ని ఆశ్రమాలూ సమప్రాధాన్యం గలవే గృహస్థాశ్రమాన్ని ప్రశంసిస్తూ మన్వాదులు వ్రాశారంటే దానికి కారణం గృహస్థుడు ఇతరాశ్రములకు, ఇతర ప్రాణులకు కూడా మనుగడను కల్పించే వాడవడంచేతనే అంతేకాని ఆ గృహస్థుడే కాలాంతరంలో వానప్రస్థంకాని, సంన్యాసం కాని స్వీకరించినాడంటే అతడు ఉన్నతస్థితినుండి పడిపోయినాడని కాదు

ఒక జీవుడు దేహధారణం చేయడానికి ముందునుంచే అతనికి సంస్కారాలు ప్రారంభం అయి మళ్ళీ ఈ దేహం విడిచిపెట్టిన తరవాత పూర్తి అవుతాయి ఆ సంస్కారాల సంఖ్యవిషయంలో విప్రతిపత్తి ఉంది మొత్తం నలభై సంస్కారాలు అని గౌతమాదులు చెప్పి ఉన్నారు ఉన్న దోషాలను తొలగించి, లేని గుణాలను సంపాదించి పెట్టేది "సంస్కారం" ప్రతిసంస్కారంలోను కొన్ని మంత్రాలను పఠిస్తూ ఆచరించే ప్రక్రియ ఉంటుంది ప్రధానంగా మూడువేదాలూ, వాటికి వేరు వేరు శాఖలూ ఉన్నాయి ఈ వేదశాఖాభేదాలని పట్టి సంస్కారవిధానాలలో కూడా కొన్ని భేదాలు ఉంటాయి

బ్రహ్మచర్యాశ్రమద్వారమైన ఉపనయనం ఎంత ప్రధానమైనదో, గృహస్థాశ్రమద్వారమైన వివాహం కూడా అంత ప్రధానమైనది ఇద్దరు వ్యక్తులకు కలిపి జరిపించే సంస్కారం అవడం కూడా దీనిలోని ఒక విశేషం వైదికధర్మంలో వివిధకర్మలు చెప్పబడి ఉన్నాయి అయితే ఆ కర్మలను ఆచరించె అధికారం పురుషుడికి భార్య ఉంటేనే కాని లభించదు ''అయజ్ఞో వా ఏష యోఽపత్నీకః" (పత్ని లేని వానికి యజ్ఞం లేదు) అని తైత్తిరీయబ్రాహ్మణం చెపుతూన్నది ఈ అర్థాన్నే స్మృతులు స్పష్టీకరిస్తున్నాయి

"పత్నీ ధర్మార్థకామానాం కారణం ప్రథమం స్మృతమ్ ।
అపత్నీకో నరో భూప కర్మయోగ్యో న జాయతే ।

బ్రాహ్మణః క్షత్రియో వాపి వైశ్య శ్శూద్రోఽపి వా నృప॥''
(యాజ్ఞవల్క్యస్మృతివ్యాఖ్యానంలో అపరార్కుడు ఉదాహరించినది)

'రాజా ! ధర్మార్థకామాలకి ప్రధానకారణం భార్యయే బ్రాహ్మణుడైనా, క్షత్రియుడైనా, వైశ్యుడైనా, శూద్రుడైనా భార్యలేని వానికి కర్మయోగ్యత లేదు'' అని ఓని భావం ఈలాంటి కర్మార్హతను కలిగించే ఉత్తమసంస్కారం వివాహసంస్కారం

మంత్రాల ప్రభావం అనూహ్యమైనది వైదికసంస్కారాలలో మంత్రాలకెంత ప్రాధాన్యం ఉందో తంత్రానికి (ఆయా ప్రక్రియలకి) అంత ప్రాధాన్యం ఉంది ఆ ప్రక్రియతో కలిపి ఉచ్చరించిన మంత్రాలకీ, మంత్రాలతో కలిపి చేసిన ప్రక్రియకీ శాశ్వతమైన ఉత్తమఫలాన్నిచ్చే శక్తి ఉన్నదనే దృఢవిశ్వాసమే ఈ సంస్కారాలన్నింటికీ మూలం లోకంలో అన్ని దేశాలలోను, అన్ని మతాలవారిలోను 'వివాహం' అనేది ఉండవచ్చు కాని, ఇలాంటి సంస్కారం కేవలం వైదికధర్మంలో మాత్రమే ఉన్నది ఏతద్ధర్మానుసారం వివాహం అనేది త్రెంచడానికి వీలులేని సుదృఢపవిత్రబంధం ఈ విషయాన్నే సూచిస్తూ వరించే మంత్రాలూ, ప్రక్రియలూ వివాహసంస్కారంలో ఉన్నాయి అయితే ఈకాలంలో వీటినిగూర్చి తెలిసినవారు చాల అరుదు

డాక్టర్ రాణి రామకృష్ణ వివాహసంస్కారంలో ఉండే వైశిష్ట్యాన్ని సప్రమాణంగా, సువిపులంగా ఈ గ్రంథంలో విశదీకరించాడు ఇతడు మా మిత్రులూ, సుప్రఖ్యాతశాస్త్ర విద్వాంసులూ అయిన శ్రీ రాణి నరసింహశాస్త్రిగారి కుమారుడు అయితే ఇతడు తండ్రిని మించిన పండితుడు ఆయన పాండిత్యం వ్యాకరణ, న్యాయ, వేదాంతాలకు పరిమితం అయితే రామకృష్ణ ప్రాచ్యపాశ్చాత్యశాస్త్రాలలో మంచి పాండిత్యం ఉన్నవాడు చిన్ననాడు పూర్తిగా వేదాధ్యయనం చేసి కెమిస్ట్రీలో M Sc Ph D సంపాదించి ఈమధ్య సంస్కృతంలో Ph D సంపాదించనున్నాడు అయితే ప్రతీదానికి ఏదో ఒక వైజ్ఞానికభావం (Scientific Significance) ఉంది అంటూ చెప్పే 'నవీనఛాందసం' ఇతనికి లేదు కొన్ని సమయాలలో యజ్ఞోపవీతం చెవికి మెలివేసుకోవాలని ఆచారం ఉంటే– "ఔను చెవిదగ్గర కొన్ని నెర్వ్స్ ఉంటాయి వాటిని నొక్కితే కొన్ని పనులు సుఖంగా జరుగుతాయి'' అని ఒక సైంటిస్టు అభిప్రాయం వెలిబుచ్చాడు పాపం యజ్ఞోప

పీఠం ధరించని వాళ్లందరూ ఏమి కావాలో మరి: ఇలాంటివేమీ లేకుండా వివాహం అనేది వధూవరులిద్దరికీ ఒక సుఖమయ సహజీవనాన్ని ప్రసాదించే శక్తిగల ప్రధానసంస్కారం అని సోదాహరణంగా నిరూపించేదు ఇలాంటి ప్రామాణిక గ్రంథాన్ని రచించిన డా॥ రాణి రామకృష్ణ పరిశ్రమ సర్వథా అభినందనీయము ఏతద్గ్రంథరచనా ప్రోత్సాహకులైన డా॥ పి శివరామన్ దంపతులు, వారికి ఆ భావం కలగడానికి కారణమైన వారి జ్యేష్ఠపుత్రుడు చి వాచస్పతి ఆస్తికజన ప్రశంసాపాత్రులు

5-1-1993

పుల్లెల శ్రీరామచంద్రుడు

శ్రీ మహాగణాధిపతయే నమః

# వివాహ సంస్కారము

హిందువుల జీవనవ్యవస్థయే విచిత్రమైనది, విలక్షణమైనది హిందూజీవన విధానంలో ''చతుర్విధ పురుషార్థములు '' అనే అద్వితీయమైన జీవితలక్ష్యాలు నిర్దేశింపబడ్డాయి అవియే ధర్మార్థకామమోక్షములు వీటిలో ధర్మార్థకామములు ఐహికములు మోక్షము ఆముష్మికము అర్థకామములు సమస్తమానవాళికి పరిచితములే మానవులకు మాత్రమే గాక, పశుపక్ష్యాదులకు కూడ సుఖసాధనములను సంపాదించుట (అర్థము), వాటిని అనుభవించుట (కామము) అనేవి సమానమే ఇట్టి సర్వప్రాణి సాధారణములైన అర్థకామాలకు ధర్మాన్ని జోడించి మనిషి క్రమముగా పశుత్వమును మానవత్వమును, దేవత్వమును గూడ అధిగమించి బ్రహ్మభావమును పొందగల్గుతాడని వేదశాస్త్రిలు ఉద్ఘోషిస్తున్నాయి ధర్మసహితం కాని అర్థకామాలు మానవుని పతనానికి కారణమవుతాయని ధర్మశాస్త్రిలు బోధించడమే కాదు, ఆధునిక మానవుని అనుభవం కూడ నిరూపిస్తోంది

ఆహార నిద్రాభయమైథునం చ సామాన్యమేతత్పశుభిర్నరాణామ్।
ధర్మో హి తేషామధికో విశేషో ధర్మేణ హీనాః పశుభిస్సమానాః॥

మానవుడు ధర్మార్థకామములనే త్రివర్గాన్ని సేవించి కృతార్థుడగుటకొరకై వేదాలు ఆశ్రమవ్యవస్థను నిర్దేశించేయి ఛాందోగ్యోపనిషత్తు (సామవేదం) ఇల్లా వర్ణించింది—

"త్రయో ధర్మస్కంధాః ।యజ్ఞోఽధ్యయనం దానమితి ప్రథమః।
తప ఇతి ద్వితీయః। బ్రహ్మచార్యాచార్యకులవాసీ తృతీయః॥"

గురుకులంలో నివసిస్తూ వేదాన్ని అధ్యయనం చేసే ఆశ్రమమే బ్రహ్మచర్యము ఈ అధ్యయనం పూర్తి అయ్యేక, గురువు అనుమతితో బ్రహ్మచారి గురుకులాన్ని విడిచి, స్వగృహానికి వస్తాడు అపుడాతడు వివాహం చేసుకోవాలని

నిశ్చయించుకుంటాడు వివాహం చేసుకోవాలని ఎందుకనుకుంటాడు? ఇంద్రియ సుఖానుభవం కొరకా? ఆధునికసమాజధోరణిలో చూస్తే అల్లాగే అనిపిస్తుంది కాని వేదం ఈ నిర్ణయం వెనుక ఉన్న ఆలోచనను మరోలా అభివర్ణించింది శతపథ బ్రాహ్మణం ఇల్లా చెప్పింది—

"ప్రాగ్దారపరిగ్రహాత్పురుష ఆత్మా ప్రాకృతో ధర్మజిజ్ఞాసోత్తర కాలం లోకత్రయసాధనం పుత్రం, ద్విప్రకారం చ విత్తం మానుషం దైవం చ, తత్ర మానుషం విత్తం కర్మరూపం, పితృలోకప్రాప్తి సాధనం, విద్యాం చ దైవం విత్తం దేవలోకప్రాప్తి సాధనం సోఽకామయత జాయా మే స్యాత్ "

"వేదాధ్యయనం పూర్తిచేసిన బ్రహ్మచారి వేదోక్తకర్మానుష్ఠానం చెయ్యాలని, పరమేశ్వరుణ్ణి ఉపాసించాలని, వంశతంతువును అవిచ్ఛిన్నంగా కొనసాగించాలని తలపోయటం సహజం ఈ ధర్మాలన్నీ ధర్మపత్న్యధీనాలు కాన అతడు నాకు యోగ్యురాలైన భార్య కావాలి అనుకుంటాడు " ఈ వాక్యాల్ని బట్టి వివాహం యొక్క ముఖ్యప్రయోజనం ధర్మసాధన అనియు, ఆనుషంగిక ప్రయోజనం సుఖానుభవమనీ తేలింది సంక్షేపంగా చెప్పాలంటే, అతిథిపూజ, దేవతాపూజ, సంతానప్రాప్తి, యథాశక్తి దానము, స్వాధ్యాయము ఇవి గృహస్థుని ధర్మాలు వీటిని శ్రద్ధగా ఆచరిస్తే జీవితం పునీతం అవుతుంది అందుకోసం వివాహం

ఆశ్రమాలలోకెల్లా గృహస్థాశ్రమం గొప్పదని శాస్త్రాలు ఉద్ఘోషిస్తున్నాయి మహాభారతమహిమను వర్ణిస్తూ, వ్యాసమహర్షితో బ్రహ్మ ఇల్లా అంటాడు—

"అస్య కావ్యస్య కవయో న సమర్థా విశేషణే ।
విశేషణే గృహస్థస్య శేషాస్త్రయ ఇవాశ్రమాః ॥

ఆశ్రమాలలోకెల్లా గృహస్థాశ్రమం ఎట్లు శ్రేష్ఠమో, అటులనే కావ్యాలలోకెల్లా మహాభారతం గొప్పది అని దీని భావము

మనం పుడుతూనే మూడు ఋణాలతో పుడతామని వేదం చెప్తోంది

"జాయమానో వై బ్రాహ్మణస్త్రిభిర్ ఋణవా జాయతే బ్రహ్మ

చర్యేణ ఋషిభ్యో యజ్ఞేన దేవేభ్యః ప్రజయా పితృభ్య ఏష వా అనృణో యః పుత్రీ యజ్వా బ్రహ్మచారివాసీ "

ఈ ఋణాలలో మొదటిది ఋషిఋణం. వేదము, పురాణాలు, శాస్త్రాల్ని అధ్యయనం చేసి ఆ విజ్ఞానాన్ని సమాజానికి అందించటం ద్వారా ఈ ఋణం తీరుతుంది. ఇది ప్రధానంగా బ్రహ్మచర్యాశ్రమంలో ప్రారంభమై, గృహస్థాశ్రమంలోకి అనువర్తిస్తుంది. యజ్ఞానుష్ఠానంచేత దేవఋణము, సంతానప్రాప్తిచేత పితౄణము తీర్తాయి. ఈ రెండింటికి మూలం గృహస్థాశ్రమమేనని వేరే చెప్ప నక్కరలేదు. అంటే, ఒక విధంగా మన జీవితంలో ఋణవిముక్తికి నాంది పలకడమే వివాహం అని చెప్పవచ్చు.

వేదం అవివాహితుణ్ణి యజ్ఞానికి అనర్హుడిగా ప్రకటించింది. "అయజ్ఞో వా ఏష యోఽపత్నీకః". శ్రీరాముడు సీత అడవిలో నుండగా అశ్వమేధయాగాన్ని సంకల్పించి, ఆమె యొక్క సువర్ణప్రతికృతిని ప్రతినిధిగా చేసుకుని, ఆ యజ్ఞాన్ని అనుష్ఠించిన గాథ సర్వులకు విదితమే.

భార్యయనగా పురుషునికి జీవితంలో, దేహంలో, ప్రాణంలో, అటరికి ఆత్మలో కూడ సగం అనిశ్రుతి.

"అర్థో అర్ధో వా ఏష ఆత్మనో యత్పత్నీ".

గృహస్థాశ్రమం లేకుండా మిగిలిన ఆశ్రమాలకు ఉనికియే లేదు. ఈ ఆశ్రమాన్ని "సర్వోపకారక్షమం ఆశ్రమం" అని కాళిదాసు రఘువంశంలో వర్ణించాడు. బ్రహ్మచర్యంగాని, యతిధర్మంగాని నిలవాలంటే అది గృహస్థుని అతిథిధర్మంపై ఆధారపడి ఉంటుంది. ఈ విషయాన్ని మనుస్మృతి ఇట్లా చెప్పింది.

"యథా వాయుం సమాశ్రిత్య వర్తంతే సర్వజంతవః ।
తథా గృహస్థమాశ్రిత్య వర్తంతే సర్వ ఆశ్రమాః ।।"

ప్రాణవాయువు లేనిదే ఏ ప్రాణియు బ్రతకలేదు. అట్లే, గృహస్థాశ్రమం లేకుండా ఇతర ఆశ్రమాలే లేవు. ఇట్టి గృహస్థాశ్రమానికి ప్రవేశద్వారము,

పరమపవిత్రమునగు వివాహసంస్కారము అష్టాచత్వారింశత్ (48) సంస్కారములలో ప్రధానమైనదిగా పరిగణింపబడుటలో ఆశ్చర్యము లేదు

వివాహప్రయోగంలో సూత్రీయము, శట్టీయము అను సంప్రదాయ భేదములే గాక, దేశకులాచార ప్రయుక్తములైన ఇతరభేదాలు కూడా ఉన్నాయి ఈ ప్రయోగవివరాల జోలికి పోకుండా, వివాహప్రయోగంలోని కొన్ని అంగాలు మాత్రం ఈ క్రింది పేరాలలో వివరింపబడుచున్నవి

## గణాధిపతి పూజ

అన్ని శుభకర్మలకు ముందు విఘ్నేశ్వరుణ్ణి పూజించాలి అని పద్మపురాణం చెప్తోంది

శ్రీమహాదేవ ఉవాచ

అస్యైవ పూజనాదగ్రే దేవాస్తుష్టా భవంతు చ।
సర్వాసామపి దేవానాం పితౄణాం చ సమంతతః।
తోషో భవతు నిత్యం చ పూజితేఽగ్రే గణేశ్వరే ॥

(పద్మపురాణం, సృష్టిఖండం, 66వ అధ్యాయం)

సాధారణంగా మంచి పనులకు విఘ్నాలు వస్తూంటాయి "శ్రేయాంసి బహువిఘ్నాని" అని నానుడి ఈ విఘ్నాలు రాకుండా నివారించటానికి ఆదిలో విఘ్నేశ్వరుణ్ణి పూజిస్తారు అంతే కాదు, శ్రౌతకర్మలన్నిటిలో అగ్ని ఎట్లో, స్మార్తకర్మలలో విఘ్నేశ్వరుడట్లే అగ్నికి ప్రతీకయే విఘ్నేశ్వరుడు అగ్నిని కూడ గణాధిపతిగా వేదం వర్ణించింది వేదంలో అగ్నిని స్తుతించే మంత్రమే విఘ్నేశ్వరుని ప్రార్థించే ప్రముఖమంత్రంగా వినియోగింపబడుతోంది అది యేదన-

"గణానాం త్వా గణపతిగ్ం హవామహే కవిం కవీనాముపమశ్రవస్తమమ్ జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆనశ్శృణ్వన్నూతిభిస్సీద సాదనమ్ ॥"

"హే అగ్నే ! అన్ని మంత్రములకు ప్రభువు నీవే దేవగణములన్నిటికి నీవే ప్రభువు నిన్ను మేము ఈ పుణ్యకార్యములోకి రమ్మని ఆహ్వానించుచున్నాము నీవు జ్ఞానులలో జ్ఞానివి నీ కీర్తి నిరుపమానము నీవు దేవతలలో జ్యేష్ఠుడవు నీవీ శుభకర్మయందు ఉపవిష్టుడవై, మమ్ములను పరిపాలింపుము " అగ్నిని స్తుతించే ఈ విశేషణాలన్నీ గణాధిపతికి కూడా వర్తిస్తాయని స్పష్టమే కదా !

ఇంతేగాక, విఘ్నేశ్వరుని వాహనమగు మూషకము కూడా అగ్నిదేవుని రూపమే యని తైత్తిరీయబ్రాహ్మణము చెప్పుచున్నది

"అగ్నిర్దేవేభ్యో నిలాయత। ఆఖూ రూపం కృత్వా। స పృథివీం ప్రావిశత్। స ఊతీః కుర్వాణః పృథివీమనుసమచరత్। తదాఖుకరీషమభవత్॥"

"అగ్నికి ఒకప్పుడు దేవతలపై కోపమువచ్చి, వారికి కనపడకుండగా దాగుటకై మూషికరూపమును ధరించి, భూమిలో బిలములను చేయుచూ భూమి లోపలనే సంచరించెను బిలములను చేసేటప్పుడు బయటపడే మట్టిలో అగ్నియొక్క తేజస్సు ఇమిడియున్నది కాన ఇట్టి మట్టి యజ్ఞాంగమే అగుచున్నది ''

శుభకర్మలన్నిటిలో సర్వప్రథమంగా చేసే గణాధిపతి పూజలోని సర్వ ప్రథమమంత్రం కూడా చాలా విశిష్టమైనది

"దేవీం వాచమజనయంత దేవాస్తాం విశ్వరూపాః పశవో వదన్తి।
సా నో మంద్రేషమూర్జం దుహానా ధేనుర్వాగస్మానుపసుష్టుతైతు॥"

"దేవతలు వాక్కును సృష్టించేరు ఆ వాక్కునే మానవులు ఉచ్చరిస్తున్నారు అంతే కాదు సమస్తప్రాణులు కూడ ఆ వాక్కునే ఉచ్చరిస్తున్నాయి మాచే స్తుతింపబడే యీ వాక్కు ఆనందమును, అన్నసమృద్ధిని, క్షీరాదిసమృద్ధిని కలిగించుగాక!"

మానవులే కాక పశుపక్ష్యాదులు కూడ సంభాషించుకుంటాయని, అట్టి సర్వప్రాణిసాధారణమగు వాక్కు ఈశ్వరనిర్మితమని చెప్పే ఈ ఋక్కులోని గాంభీర్య మాధుర్యములు అద్వితీయములు జ్ఞానస్వరూపుడగు విఘ్నేశ్వరుని ఆరాధన ఈ మంత్రంతో ప్రారంభం కావటం ఎంతో యుక్తము ఆ తరువాత పురాణదంపతు

లగు లక్ష్మీనారాయణులు, ఉమామహేశ్వరులు, వాణీహిరణ్యగర్భులు, శచీపురందరులు, అరుంధతీవసిష్ఠులు, సీతారాములను ఆరాధిస్తారు తరువాత కలశపూజ-ఇచట చెప్పే మంత్రం జలాల మాహాత్మ్యాన్ని వర్ణిస్తోంది

"ఆపో వా ఇదగ్ం సర్వం విశ్వా భూతాన్యాపః ప్రాణా వా ఆపః పశవ ఆపోఽన్నమాపోఽమృత మాపస్సమ్రాడాపో విరాడాపస్స్వరాడా పశ్ఛందాగ్స్యాపో జ్యోతీగ్ష్యాపో యజూగ్ష్యాపస్సత్యమాపస్సర్వా దేవతా ఆపో భూర్భువస్సువరాప ఓమ్ ।"

ఈ సమస్తప్రాణులకు, లోకాలన్నిటికి జలమే ఆశ్రయమని ఈ మంత్రం యొక్క స్థూలంగా కనబడే అర్థం కాని Electromagnetic field అనే అర్థంలో ''అవః'' అనే పదం వేదంలో అక్కడక్కడ ప్రయోగింపబడిందని భావించ డానికి ఆధారాలున్నాయి భూర్భువస్సువరాది లోకాలన్నీ అట్టి తేజస్సునుండి జన్మించాయని వర్ణించడం చాలా యుక్తంగా ఉంటుంది

కలశపూజలో అఖండభారతభావన స్ఫురణకు వస్తుంది

"గంగే చ యమునే చైవ గోదావరి సరస్వతి ।
నర్మదే సింధు కావేరి జలేఽస్మిన్‌సన్నిధిం కురు॥"

సమస్త నదీజలాలు ఈ కలశంలోనే సన్నిహితమై ఉన్నాయని భావన చేయాలి స్వాతంత్ర్యం వచ్చిన కాలంలో జరిగిన దేశవిభాజనంవల్ల పవిత్రసింధు నది మనకు కాకుండా పోయింది కాని, భావనలో దారిద్ర్యం లేదు గదా, కలశ పూజ అయిన తర్వాత, గణాధిపతిని ధ్యానావాహనాది షోడశోపచారాలతో అర్చించి, జరుగబోయే వివాహం నిర్విఘ్నం కావాలని ప్రార్థిస్తారు

## పుణ్యాహవాచనము

శుభకర్మ జరుగబోయే గృహము పవిత్రమగుటకు, గృహముతో బాటు మొత్తం వాయుమండలంలోనే విలక్షణమైన పవిత్రతను ఆపాదించేందుకు ఉద్దేశించిన పవిత్రకర్మయే పుణ్యాహవాచనము యజమాని, ఇతరబంధువులు వీరందరి మనస్సు ప్రసన్నం కావడం కూడా ఈ కర్మయొక్క ప్రయోజనము దేనితో

వేదాధ్యయనాన్ని, యజ్ఞాలను, అన్ని పుణ్యకర్మలను ఆరంభిస్తారో, అట్టి పరమ పావనమైన ఓంకారంతో దీనిని ఆరంభిస్తారు యజమాని దేవతలను ఇల్లా ప్రార్థిస్తాడు

"భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః। భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః। స్థిరైరంగైస్తుష్టువాగ్ంసస్తనూభిః। వ్యశేమ దేవహితం యదాయుః॥"

''ఓ దేవతలారా! మేమీ చెవులతో శ్రుతిస్మృతిపురాణ రూపములగు మంగళవాక్కులను విందుము గాక! మేమీకన్నులతో యజ్ఞములు, భగవన్మూర్తి, తదర్చన ఇత్యాది మంగళదృశ్యములనే చూతుము గాక! మేము దృఢమైన దేహముతో ఈశ్వరదత్తమైన నూరు సంవత్సరముల ఆయుర్దాయము ననుభవించెదము గాక!"

మానవుడు ధనధాన్యములతో, ఆరోగ్యంతో వర్ధిల్లడంతో పాటు భగవత్కార్యనిరతి, స్వాధ్యాయము, సత్సంగములను కూడ సమృద్ధిగ కల్గియుండవలెనని ఈ మంత్రము నిర్దేశిస్తోంది

మంత్రవూతములైన జలాన్ని యజమాని శిరస్సుపై ప్రోక్షించి, ఆయుర్వృద్ధి బ్రహ్మవర్చస్సు కలుగుగాక యని ప్రార్థిస్తారు

"ఆప ఉందంతు జీవసే దీర్ఘాయుత్వాయ వర్చసే।"

అగ్నిని ఈవిధంగా ప్రార్థిస్తారు-

"జాతవేదో యశో అస్మాసు దేహి ప్రజాభిరగ్నే అమృతత్వమశ్యామ్ । యస్మై త్వగ్ం సుకృతే జాతవేద ఉలోకమగ్నే కృణవస్స్యోనమ్ । అశ్వినగ్ం సపుత్రిణం వీరవంతం గోమంతగ్ం రయిం నశతే స్వస్తి॥"

హే అగ్నే! మాచే స్తుతింపబడే నీవు మాకు కీర్తిని, అమృతత్వమును ఇచ్చెదవుగాక! ధనధాన్యసమృద్ధిని, పశుసమృద్ధిని, సత్సంతానమును కూడ ఇమ్ము

ఇంకా "మాకు శాన్తి, పుష్టి, తుష్టి, వృద్ధి, అవిఘ్నము, ఆయుష్యము, ఆరోగ్యము, పవిత్రకర్మానుష్ఠానము, వేదశాస్త్రాధ్యయనం చేసే భాగ్యము, ధనధాన్య సంపదలు కలగాలనీ, ఆపదలు పాపాలు తొలగి పోవాలనీ'' ప్రార్థిస్తూ, యజమాని కలశాలలో మంత్రపూతజలాన్ని ఒక పద్ధతిలో పోస్తాడు నవగ్రహాలు అనుకూలంగా ఉండాలని, ఈతిబాధలు దరికిరాకుండా ఉండాలని, ఋతుధర్మాలు సక్రమంగా ప్రవర్తిల్లాలనీ పంటలు బాగా పండాలనీ, పుష్పఫలసమృద్ధి కలగాలనీ ప్రార్థిస్తాడు

''ఈ వివాహశుభకర్మ జరిగే కాలంలో ఏవైనా నక్షత్రాది కృతదోషాలు ఉండవచ్చు అట్టి దోషాలన్నీ శమించుగాక" యని యజమాని నక్షత్రదేవతలను ప్రార్థిస్తాడు సమస్త సన్మంగళప్రాప్తికొరకై పురోహితునికి, సభలోని పెద్దలకు, పండితులకూ వందనమాచరించి, వారి ఆశీర్వచనాన్ని సవినయంగా స్వీకరిస్తాడు ఇంకను యజమాని అగ్నిని ఇల్లా ప్రార్థిస్తాడు.

"అగ్నిశ్శుచివ్రత తమశ్శుచిర్విప్రశ్శుచిః కవిః। శుచీ రోచత ఆహుతః॥ ఉదగ్నే శుచయస్తవ శుక్రా భ్రాజన్త ఈరతే। తవ జ్యోతీగ్‌ష్యర్చయః॥"

"అగ్ని తాను స్వయముగనే పరిశుద్ధుడు వేదవేదాంగ వేత్తలును పరిశుద్ధులే వారిచే ఆరాధింపబడు అగ్ని హోమద్రవ్యములను గ్రోలి ప్రకాశిస్తున్నాడు అట్టి అగ్నియొక్క కాంతులు సర్వత్ర వ్యాపించి పవిత్రత నాపాదించుచున్నవి ''

ఇంకా యజమాని సర్వత్ర శుద్ధికొరకు పరమపావనమగు పవమానసూక్తాన్ని పఠిస్తాడు ఇంద్రాది దేవతలందరి అనుగ్రహముచే తాను పవిత్రుడనగుచున్నానని భావన చెస్తాడు మంత్రపూతమైన జలాన్ని చల్లుట ద్వారా గృహం అన్నివైపులా పరిశుద్ధమై వేదోక్తకర్మానుష్ఠానయోగ్యతను సంతరించుకుంటుంది

'గృహపతి' అంటే ఇంటి యజమాని అని మనం అనుకుంటాము కాని వేదం ఇంటి యజమానిచే ఆరాధింపబడే అగ్నియే గృహపతి యని అభివర్ణించింది యజమాని పుణ్యాహవాచనాంతంలో గృహపతియగు అగ్నిని ఇల్లా ప్రార్థిస్తాడు.

వాస్తోష్పతే శగ్మయా సగ్ంసదా తే సక్షీమహిరణ్వయా గాతు మత్యా ఆవః క్షేమ ఉత యోగే వరం నో యూయం పాత స్వస్తిభి స్సదానః॥"

''హే గృహపతే ! అగ్నిహోత్రా ! మేము గ్రామాంతరం వెళ్లాలి అనుమతించు మాకు ఎట్టి అనారోగ్యము కలుగకుండగా రక్షించు మేము ఏ కార్యం కొరకు వెళ్తున్నామో, ఆ కార్యం సిద్ధించేట్లు అనుగ్రహించు మా బంధువులు, పశు సంపద క్షేమంగా ఉండేట్లు చూడు నీవు అధిష్ఠించే సభ సర్వసమర్థమైనది రమణీయమైనది సర్వజ్ఞమైనది మేము అట్టి నీ సభలో భాగమును పొందెదము (పుణ్య కార్యము జరిగె ఈ సభాస్థలికి అగ్నిహోత్రుడే అధ్యక్షుడని తాత్పర్యము) మాకు నీవు యోగక్షేమాల్ని కలిగించు (యోగమనగా మనకు లేనిది లభించుట, క్షేమ మనగా ఉన్నది భద్రముగా నుండుట) మాకు అన్ని శ్రేయస్సులను కల్గించుము'

## సమావర్తనము లేక స్నాతకము

ఎనిమిది సంవత్సరముల వయసులో బాలుడు ఉపనయనసంస్కారాన్ని పొంది, విద్యాభ్యాసంకొరకు గురుకులానికి వెళ్తాడు అక్కడ సుమారు 12 సంవత్సరములు విద్యాభ్యాసం చేసి, గురువు అనుమతిని పొంది, గురుకులాన్ని విడిచిపెట్టి తన ఇంటికి చేరుకుంటాడు ఇట్లు విద్యాభ్యాసం పూర్తిచేసుకుని ఇంటికి తిరిగి రావడాన్నే 'సమావర్తనము' అంటారు

"తత్ర సమావర్తనం నామ వేదాధ్యయనానన్తరం గురుకులాత్ స్వగృహాగమనమ్" (సంస్కారప్రకాశము)

బాలునిగా గురుకులానికి వెళ్ళిన వ్యక్తి యువకునిగా ఇంటికి తిరిగి వస్తాడు ఆతడు వీలైనంత తొందరలో వివాహం చేసుకోవాలి ఏలయన, వేదధర్మం నాల్గు ఆశ్రమాల్ని నిర్దేశించింది అవి బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసములు వాటిలో ఏదోఒక దానిని జీవితంలో చేపట్టాలి అంతేగాని, అనాశ్రమిగా ఉండరాదు

"అనాశ్రమీ న తిష్ఠేత్తు క్షణమేకమపి ద్విజః" అని శాస్త్రము కనుక, సమావర్తనసంస్కారము విద్యాసంబంధి సంస్కారమే అయినా, వివాహపూర్వాంగంగా పరిణమించింది కాని ఈ రోజుల్లో ఉపనయనము, సమావర్తనము కలిపి వివాహాత్పూర్వం చేసే సందర్భాలు గోచరిస్తున్నాయి ఇది చాలా దురదృష్టకరమైన పరిణామం విద్యాభ్యాసానికి ముందు, వెనుకల జరపాల్సిన సంస్కారాల్ని విద్యాభ్యాసంతో సంబంధం లేకుండగా వివాహ పూర్వాంగాలుగా పరిగణించి ఆచరించటం మనం వైదికజీవనానికి ఎంతదూరంగా ఉన్నామో సూచిస్తుంది

బ్రహ్మచారిగా ఉండి 10, 12 సం॥ల విద్యాభ్యాసం చేయటం ఒక గొప్ప వ్రతం దీనిని సత్రయాగంగా వర్ణిస్తోంది శాస్త్రం

"దీర్ఘసత్రం వా ఏష ఉపైతి యో బ్రహ్మచర్యముపైతి"

దీర్ఘసత్రమనగా అనేకసంవత్సరాలు చేసే యజ్ఞము యజ్ఞానికి అంతంలో 'అవభృథస్నానం' చేస్తారు విద్యాభ్యాసం ఆఖరున చేసే సంస్కారము కూడ అవభృథస్నానం లాటిదే కాన, సమావర్తన సంస్కారానికే 'స్నాతకము' అనే పేరు కూడ వచ్చింది

బ్రహ్మచర్యంలో విద్యార్థి ఎట్టి సుఖాలను ఎరుగడు శరీరాన్ని తపస్సుతో కృశింపజేస్తాడు గృహస్థాశ్రమంలో అతనికి ధర్మాచరణతో పాటు, సుఖానుభవానికి కూడ అభ్యనుజ్ఞ ఉంది గృహస్థాశ్రమానికి ద్వారం వివాహమైతే, వివాహానికి పూర్వభావి స్నాతకం కాబట్టే, ఈ యువకుడు స్నాతకవ్రతంలో బాగంగా సుగంధభరితాలైన జలాలతో స్నానం చేస్తాడు గురుకులంలో కేశఖండనం ఎరుగని స్నాతకుడు కేశఖండనం కూడా చేయించుకోవాలి కాని ఈనాటి స్నాతకునకు కేశఖండనం కొత్తకాదు కనుక, దీనిని ఒక ఆచారంగా మాత్రమే జరుపుతున్నారు ఏవో కొద్ది కేశాలను ఖండింపజేసి అయిందనిపిస్తారు యథార్థమైన ప్రయోజనం లోపించిన ఇట్టి ఆచారాల్ని పరిత్యజించడమే మేలేమో పండితులు ఆలోచించాలి

స్నాతకుడు మంత్రపూర్వకంగా స్నానాన్ని ఆచరిస్తాడు ఈ స్నాన మంత్రాలు చాలా గొప్పవి

"ఆపో హిష్ఠామయోభువః। తాన ఊర్జే దధాతన। మహే రణాయ చక్షసే ॥"

ఓ ఉదకములారా ! మీరు మాకు సుఖమును కలుగజేయుదురు మాకు అన్నము మీ అనుగ్రహముచేతనే లభించుచున్నది మీనుండి లభించిన శక్తితో మేము గొప్ప జ్ఞానమును పొందెదము గాక।

"యోవశ్శివతమో రసః । తస్య భాజయతే హనః । ఉశతీరివ మాతరః॥

తల్లులు పిల్లలను పోషించిన రీతిని, మీరు మీ మంగళకరమగు రసముతో మమ్ములను పోషింతురు గాక।

తస్మా అరంగమామవః । యస్య క్షయాయ జిన్వథ । ఆపో జన యథాచనః॥

నశ్వరమగు ఈ దేహమును రక్షించు శక్తి మీయందలి రసమునకు గలదు కాన మిమ్ములను వేడుచున్నాము. ఓ జలములారా! మమ్ములను సత్సంతానము గలవారినిగా జేయుడు

హిరణ్యవర్ణాశ్శుచయః పావకా యాసు జాతః కశ్యపో యాస్వింద్రః। అగ్నిం యా గర్భం దధిరే విరూపాస్తాన ఆపశ్శగ్గ్ స్యోనా భవంతు॥

ప్రజాపతి, ఇంద్రుడు జలములందే జన్మించిరి జలములు తమ గర్భము నందు అగ్నిని ధరించును పవిత్రమై, స్వచ్ఛవర్ణముగల యీ జలములు సర్వ మును పరిశుద్ధిచేయజాలి యున్నవి అట్టి జలములు మాకు సుఖమును అను గ్రహించుగాక।

యాసాగ్ం రాజా వరుణో యాతి మధ్యే సత్యానృతే అవపశ్యన్ జనానామ్ । మధుశ్చుతశ్శుచయో యాః పావకాస్తాన ఆపశ్శగ్గ్ స్యోనా భవంతు ॥

వరుణుడు జలముల యందుండి, ప్రజల పుణ్యపాపములను పరిశీలించు చుండును మధురసమును వర్షించు ఈ జలములు మాకు సుఖమును అనుగ్రహించు గాక।

యాసాం దేవా దివి కృణ్వంతి భక్షం యా అంతరిక్షే బహుధా భవంతి। యాః పృథివీం పయసోందంతి శుక్రాస్తాన ఆపశ్శగ్గ్ స్యోనా భవంతు ॥

ఈ జలములనే దేవతలు స్వర్గములో పానము జేసెదరు ఇవి ఆకాశములో బాష్పమేఘాద్యనేకరూపములను ధరించును ఇవి ఎండి, బీటలు వారిన నేలకు ఊరటమ కల్గించును ఇట్టి జలములు మాకు సుఖముల నిచ్చుగాక,

స్నాతకుడు నూతన వస్త్రాల్ని ధరించి, గంధాదులచే అలంకరించు కుంటాడు పుష్పమాలను, ఉపవీతాన్ని ధరిస్తాడు వేదశాస్త్రాలు స్నాతకుణ్ణి మహాపురుషునిగా పూజార్హునిగా పరిగణిస్తాయి పారస్కరగృహ్యసూత్రం ఆర్ఘ్యరు పూజ్యులతో ఒకనిగా స్నాతకుణ్ణి అభినందించింది

"షడర్ఘ్యా భవన్తి । ఆచార్య ఋత్విక్ వైవాహ్యో రాజా ప్రియ స్స్నాతక ఇతి॥'

ఆశ్వలాయన గృహ్యసూత్రం స్నాతకుణ్ణి మహాపురుషునిగా వర్ణించింది

"మహద్వా ఏతద్భూతం యస్స్నాతకః ॥"

స్నాతకుడు పాలాశసమిధను అగ్నికి అర్పించి, తనకు అగ్నిహోత్రునితో స్నేహం కావాలని కాంక్షిస్తాడు

"ఇమగ్గ్ స్తోమమర్హతే జాతవేదసే రథమివ సమ్మహేమ మనీషయా।భద్రా హి నః ప్రమతిరస్య సగ్ంసద్యగ్నే సఖ్యే మారిషామ వయం తవ॥"

"హే అగ్నే! నీవు మా స్తోత్రముల కర్హుడవు ఈ సభలో నీకు మా విషయమై మంగళకరమగు బుద్ధి కలుగుగాక! నీ స్నేహమును చేయు మేము ఎన్నటికి అపదలను పొందకుండ నుందుముగాక!''

స్నాతకుడు అలంకృతుడై, సమస్త సంపదలను, ఆయురారోగ్యాలను కోరు

వార్తై ఆజ్యహోమాన్ని చేస్తాడు తాను జనులందరికీ ప్రీతిపాత్రుడ నవ్వాలని ప్రార్థిస్తూ, వాగ్దేవికి ఆజ్యాన్ని సమర్పిస్తాడు

"సమ్రాజం చ విరాజం చాభిశ్రీర్యాచ నో గృహే।
లక్ష్మీ రాష్ట్రస్య యా ముఖే తయా మాసగ్ం సృజామసి స్వాహా॥"

''నేనుండే ఇల్లు, నేను నివసించే దేశముకూడ సిరిసంపదలతో తులతూగాలి నేను అతిశయముకల ప్రకాశము గలవాడనై వర్థిల్లెదను గాక," అని ప్రార్థిస్తూ హోమాన్ని చేస్తాడు ఆపై జయాదిహోమాల్ని నిర్వర్తిస్తాడు

తర్వాత స్నాతకుడు సమంత్రకంగా కాటుకను ధరించి, అద్దం చూసుకుంటాడు విద్యాభ్యాసకాలంలో విద్యార్థికి అలంకరించుకునే అలవాటు ఉండరాదని, ఆ అర్హత విద్య పూర్తయ్యాకనే కలుగుతుందని ఈ సంస్కారంవల్ల మనకి తెలుస్తోంది ఆపై, స్నాతకుడు గొడుగు, కర్ర చేతబట్టి కాశీయాత్రకు బయలుదేరతాడు

"చరితబ్రహ్మచర్యోఽహం కృతవ్రతచతుష్టయః।
కాశీయాత్రాం గమిష్యామి అనుజ్ఞాం దేహి మె శుభామ్॥"

''నేను వేదాధ్యయనం పూర్తిచేసి, వేదవ్రతాల్ని అనుష్ఠించేను నాకు కాశీ వెళ్లటానికి అనుజ్ఞనివ్వండి" అని బంధువులను కోరతాడు అపుడు పెళ్ళికుమార్తె యొక్క సోదరుడు మరికొందరు బంధువులు అతన్ని ఆపి, వధువు తండ్రి మాటగా ఇల్లా ప్రార్థిస్తారు-

"సాలంకారాం మమ సుతాం కన్యాం దాస్యామి తే ద్విజ।
పాణిం గృహీత్వా సాగ్నిస్త్వం గచ్ఛ స్వాగచ్ఛ మద్గృహమ్॥"

"ఓయీ ! యువకుడా! నీకు మాపిల్లనిచ్చి వివాహం జరిపిస్తాము అపుడు ధర్మపత్నీసమేతుడవై త్రేతాగ్నులతో కూడి వెళ్లగలవు ఇపుడు మాయింటికి రమ్ము ''

ఈ కాశీయాత్ర పెళ్ళికి తరలివచ్చిన బంధువర్గానికి గొప్ప ఉత్సాహాన్ని వినోదాన్ని కలిగిస్తుంది కాని దీని ముఖ్యప్రయోజనం వేరే ఉంది విద్యాభ్యాసం పూర్తిచేసిన విద్యార్థి యౌవనంలో ఉండే భావావేశం చేత తన శేష జీవితాన్ని

ధర్మాచరణకు, తపస్సు చేసుకోవటానికి అంకితం చేయాలని అనుకోవటం సహజం తన గురుకులజీవితం ఇటువంటి సంస్కారాలనే ఇస్తుంది జీవితంలో వైరాగ్యమే యథార్థమైన అమృతమని బ్రహ్మచారి పరోక్షంగానైనా తెలుసుకుంటాడు. అట్టి స్థితిలో అతడు కాశీయాత్రకు సంకల్పిస్తాడు అపుడు బంధువులు కాశీయాత్రను విరమించి, వివాహమాడి, గృహస్థాశ్రమాన్ని స్వీకరించమని బోధించటమూ సహజమే వీరి బోధనలోని తాత్పర్యమేమన- గృహస్థాశ్రమం పరమ పవిత్రమైనది మానవుని జీవితాన్ని పునీతం చేయగల శక్తి ఈ ఆశ్రమానికే ఉంది ఈ ఆశ్రమమే ఒక తీర్థము మరియు భావావేశంలో ఏర్పడ్డ వైరాగ్యం తాత్కాలికం కావచ్చు కాన, ధర్మబద్ధంగా ఇంద్రియసుఖాల్ని కొంతకాలం అనుభవించి, తరువాత పరిపుష్టమైన వైరాగ్యముకలిగి, భార్యతోకూడి వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించవచ్చును అని వారి బోధనలోని అంతరార్థము కనుక, ఈ యువకుని కాశీయాత్ర తాత్కాలికముగా వాయిదాపడినదే గాని, పూర్తిగా విరమింపబడలేదు ఈ కాశీయాత్రయొక్క అంతరార్థమెరింగిన వ్యక్తి తన ఉత్తరవయసులో ఇంద్రియసుఖాలనుండి, సాంసారికలోభాలనుండి ఉపరతుడై క్రమముగా వీతరాగావస్థకు పయనించాలని శాస్త్రాలు ఉద్బోధిస్తున్నాయి

## అంకురారోపణము

సుముహూర్తానికి ముందు రోజు రాత్రి వధూవరుల తల్లిదండ్రులు 'అంకురారోపణము' అనే కర్మను చేస్తారు ఈ కర్మ సనాతనధర్మానుయాయులకు ప్రకృతిలోని పచ్చదనంతో గల ఘనిష్ఠ సంబంధానికి ప్రతీక పరమేశ్వరుడు మనం సుఖంగా జీవించటానికి కావలసిన ఓషధులను ప్రకృతిలో సమృద్ధిగా సమకూర్చి పెట్టేడు ఈ ఓషధులు లేనిదే మన బ్రతుకులే లేవు అట్టి ఓషధులయందు కృతజ్ఞతా భావాన్ని ప్రకటించే వైదికకర్మయే అంకురారోపణము జాతకర్మ ఇత్యాది రెండు, మూడు కర్మలను మినహాయించి, మిగిలిన మంగళకార్యములన్నిటిలోను 'అంకురారోపణము'ను అనుష్ఠించాలని ఆశ్వలాయనగృహ్యసూత్రం విధిస్తోంది

చంద్రుడు ఓషధులకు అధిపతి కాన, అంకురారోపణాన్ని రాత్రియందు చేయాలి

"ఓషధీనాం హి సర్వాసాం చంద్రః ప్రోక్తోఽధిదైవతమ్।
తస్మాత్సర్వప్రయత్నేన రాత్రావంకురరోపణమ్॥"

మట్టితో చేసిన అయిదు పాలికలలో పుట్టమట్టి పోసి, ఆ మట్టిలో ఓషధి బీజాలను వేసి, అవి మొలకెత్తునట్లు చేయుట అంకురారోపణములోని ప్రధానాంశము కర్మ పేరులోనే ఈ అర్థం ఇమిడి ఉంది పాలికల మూలమునందు దూర్వ, రావియాకు, మారేడుదళములను ఉంచి, చుట్టూ తెల్లని దారంతో కడతారు శుచియైన ప్రదేశాన్ని గోమయంతో అలికి, ముగ్గుపెట్టి, ఆపై పాలికలనుంచుతారు

"భూమిర్ధేనుర్ధరణీ లోకధారిణీ"

''ఈ భూమి కామధేనువు సస్యాల్ని వృద్ధిపొందిస్తుంది సమస్తప్రాణులను తనయందు ధరిస్తుంది '' ఈ మంత్రంతో యజమాని మట్టిని అభిమంత్రిస్తాడు తర్వాత క్రింది మంత్రాలతో పాలికలలో మట్టిని నింపుతాడు

"ఉద్ధృతాసి వరాహేణ కృష్ణేన శతబాహునా । మృత్తికే హన మే పాపం యన్మయా దుష్కృతం కృతమ్॥ మృత్తికే బ్రహ్మదత్తాసి కాశ్యపేనాభిమంత్రితా। మృత్తికే దేహి మే పుష్టిం త్వయి సర్వం ప్రతిష్ఠితమ్। మృత్తికే ప్రతిష్ఠితే సర్వం తన్మే నిర్ణుద మృత్తికే ।తయా హతేన పాపేన గచ్ఛామి పరమాం గతిమ్॥"

''ఓ మృత్తికా। పూర్వము నిన్ను యజ్ఞవరాహమూర్తి పైకెత్తి నిలిపేదు నీవు నాపాపాలనన్నిటిని పోగొట్టుము నాకు పుష్టినిచ్చే ఓషధులన్నీ నీయందే పండుతున్నాయి కాన నీవు నాకు పుష్టిని ఇమ్ము నిన్ను పూజించి నేను ఉత్తమ గతిని పొందుతాను

తిలలు, మినుములు మొదలగు ఏడు ఓషధులు గ్రామ్యాలు వెదురు బియ్యం, నివ్వెర ధాన్యం మొదలగు ఏడు ఓషధులు ఆరణ్యాలు యజమాని వీటిలో దొరికినంతవరకు ఓషధులను సంపాదించి, అన్నిటినీ ఒక పాత్రలో పోసి వాటిని పాలతో తడిపి ఓషధిసూక్తంతో అభిమంత్రిస్తాడు ఈ సూక్తంలోనికొన్ని మంత్రాలు దిగువనీయబడ్డాయి

"యా జాతా ఓషధయో దేవేభ్యస్త్రియుగం పురా।
మందామి బభ్రూణామహగ్ం శతం ధామాని సప్త చ॥

''ఈ ఓషధులను పూర్వం దేవతలు సృష్టించేరు వర్షాకాలము, శరత్కాలము, వసంతకాలములందు ఇవి వికసిస్తూ ఉంటాయి ప్రాణులను పోషించే ఈ ఓషధులను చూస్తేనే నాకు ఆనందం కల్గుతుంది ఎన్నో భేదాలతో ఉండే ఈఓషధులు విశేషించి గ్రామ్యాలు ఏడు, ఆరణ్యాలు ఏడు ఉన్నాయి

"శతం వో అంబ ధామాని సహస్రముత వో రుహః।
అథా శతక్రత్వో యూయమిమం మే అగదం కృత॥"

ఓతల్లులారా ! మీరు పృథివియందు అనేకస్థానాలలో పెరుగుతూ ఉంటారు మీరు నాయొక్క క్షుత్పిపాసాదిరోగములను నివారణ చేయుడు ''

శాస్త్రం క్షుత్పిపాసలను కూడ వ్యాధులుగనే పరిగణించింది శంకరభగవత్పాదులు ''క్షుద్వ్యాధిశ్చ చికిత్స్యతాం'' అన్నారు ఓషధులు ఈ రెంటినేగాక, ప్రసిద్ధములైన వ్యాధులను కూడా పోగొడతాయి

"యదహం వాజయన్నిమా ఓషధీర్హస్త ఆదధే।
ఆత్మా యక్ష్మస్య నశ్యతి॥"

నేను అన్నమును గోరి ఓషధులను స్పృశించుట తోడనే క్షుధాదిరోగము దూరమగుచున్నది

"యాస్త ఆతస్థురాత్మానం యా ఆవివిశుః పరుః పరుః,
తాస్తే యక్ష్మం విబాధంతాముగ్రో మధ్యమశీరివ॥"

ఓమానవుడా ! ఈ ఓషధులు నీ శరీరంలో నోటిద్వారా ప్రవేశించి రసరూపముగా దేహమునంతయు ఆక్రమించి, ధర్మాత్ముడగు రాజు దుష్టులను శిక్షించిన రీతిని, రోగములను నశింపజేయుచున్నవి

"మా వో రిషత్ఖనితా యస్మై చాహం ఖనామి వః।
ద్విపచ్చతుష్పదస్మాకగ్ం సర్వమస్త్వనాతురమ్॥"

ఓషధులారా ! మిమ్ములను పొందుటకొరకై భూమిని త్రవ్వుట తప్పనిసరి యగుచున్నది అట్టి మేము నశించకుండ నుందుము గాక ! మా గృహములోని ఇతరవ్యక్తులే గాక, పశువులు కూడ క్షేమముగ నుండుగాక !''

భూమి తల్లివంటిది కాని కాలుమోపుట తప్పనిసరి కాబట్టే "పాదస్పర్శం క్షమస్వమే" అని మనం ఉదయమే భూమిని ప్రార్థిస్తాము ఓషధులను ప్రార్థించే పై మంత్రం కూడా అట్టిదే మన చుట్టూ పెరుగుతూ మనల్ని పెంచి పోషించే చెట్టుచేమలపై మనం ఎట్టి ప్రవృత్తిని కలిగి ఉండాలో ఈ మంత్రాలవల్ల మనం నేర్చుకోవాలి

ఈవిధంగా కలిపిన ఓషధులను ఆయా మంత్రాలతో అయిదు పాలికల లోను చల్లుతారు పాలికలలో దేవతల నాహ్వానించి, పవమానసూక్తంతో నీళ్ళు చల్లుతారు ఈ పాలికలను వివాహం అయ్యేదాకా భద్రపరచాలి అంకురించిన ఓషదులకు నీళ్లుపోస్తూ ఉండాలి

## వధూగృహగమనము

వరుడు మంగళస్నానమాచరించి, నూతనవస్త్రాలను, అలంకారాదులను ధరించి తగు వాహనాన్ని అధిష్ఠించి, వధూగృహానికి బయలుదేరుతూ కొన్ని శాకునమంత్రాల్ని పఠిస్తాడు

"అనుహవం పరిహవం పరీవాదం పరిక్షపం । దుస్స్వప్నం దురుదితం " ఇత్యాది

అనగా, "ప్రయాణంలో బయల్దేరబోతూంటే వెనుకకు పిలుచుట, నిందించుట, దగ్గు తుమ్ములు మొదలగు అపశకునములు, దుస్స్వప్నములు, అమంగళకరమగు రోదనము (పిల్లల ఏడుపు మాత్రం కాదు) మాకు కలుగకుండుగాక !''

మరో శాకునమంత్రం ఇల్లా ఉంది—

"అరాత్రే అగ్నిరస్త్వారాత్పరశురస్తు తే నివాతే త్వాభివర్షతు స్వస్తి తేఽస్తు వనస్పతే స్వస్తి మేఽస్తు వనస్పతే ॥"

ఈ మంత్రం వైదికధర్మంలో చెట్లకు ఉన్న ప్రాముఖ్యాన్ని ప్రస్ఫుటం చేస్తుంది ఈ మంత్రం అర్థం ఏమనగా – ''ఓ వృక్షమా ! అడవులను నాశనం చేసే అగ్ని నీకు దూరంగా ఉండాలి చెట్లను ఖండించే గొడ్డలి నీకు దూరంగా ఉండాలి చెట్లను నేలగూల్చే తుఫాను గాలి నీకు దూరంగా ఉండాలి నీపై సమృద్ధిగా వర్షం కురవాలి '' అని వరుడు ప్రార్థిస్తాడు వృక్షాలు క్షేమంగా ఉంటే మన మందరమూ క్షేమంగా ఉంటామని ఈ మంత్రం యొక్క ఆశయం కాని హిందువులు కూడ ప్రపంచంలోని ఇతర మానవసమూహాలవలె మహోన్నతమైన ఇట్టి సనాతనసంస్కారాల్ని విస్మరించినందువలననే పవిత్రభారతదేశంలో అడవులను నిర్మూలించే దుర్గతికి నాంది పలకడం జరిగింది ఈపై మంత్రంలోని 'హే వనస్పతే'' అను ఏకవచనం "జాతావేకవచనం'' అనే న్యాయాన్ననుసరించి మొత్తం వృక్షజాతి నంతటినీ సంబోధిస్తుంది

వరుడు వృక్షాలను గురించి మాత్రమే కాక, పక్షుల గురించి కూడా ప్రేమతో కూడిన భావాల్ని వ్యక్తంచేసే మంత్రం పఠిస్తాడు

"ఉద్గాతేవ శకునే సామ గాయసి బ్రహ్మపుత్ర ఇవ సవనేషు
శగ్ంససి స్వస్తి నశ్శకునే అస్తు ప్రతి నస్సుమనా భవ॥"

''ఓపక్షీ! నీ గానం యజ్ఞంలో ఉద్గాత చేసే సామగానంలా ఎంతో మధురమైనదీ, పవిత్రమైనది ఓపక్షీ! నీకు శుభమగుగాక! మాయందు అనురాగాన్ని కల్గి ఉండు "

ఈ మంత్రం వైదికధర్మం యొక్క ప్రకృతి ప్రేమకు ప్రతీక పక్షి చేసే శబ్దమును ఉద్గాతచేసే పరమపవిత్రమగు సామగానంతో పోల్చుట ఎంతో మధురమైన అనుభూతిని కలిగిస్తుంది ప్రకృతితో మానవునికి ఉండాల్సిన సంబంధాన్ని సూచిస్తుందీ మంత్రం ఈమంత్రంలో మరో విశేషం ఉంది వరుడు తాను వివాహమాడి, యజ్ఞానుష్ఠానం చేస్తే, దానిలో తనచే కోరబడిన ఉద్గాత చేయబోయే సామగానాన్ని కూడా కలలో వలె భావన చేస్తున్నాడు ఇట్టి మంత్రాల్ని అర్థం తెలిసి పఠిస్తే, ఆ సంస్కారం జీవనగతినే మార్చగలదనుటలో సందేహం లేదు

## మధుపర్కము

వరునిచే ప్రార్థింపబడిన ఆతని మిత్రులు ముందుగా కన్యాదాత గృహానికి వెళ్ళి కన్యావరణం చేస్తారు లోకరీతి ననుసరించి మాత్రం కన్యవైపు బంధువులు వరుణ్ణి అన్వేషిస్తూ ఉంటారు కాని శాస్త్రం ప్రకారం వరుడే కన్యాదాతను కోరతాడు ఏలయన, కన్య తండ్రి దాత వరుడు ప్రతిగ్రహీత దాతయొక్క స్థానము ఎప్పటికీ ఉన్నతమే గదా!

కన్యాదాత గణాధిపతిపూజ, పుణ్యాహవాచనము, అంకురారోపణము యథా కాలంగా చేసుకుంటాడు వధువు రక్షను ధరించి గౌరిపూజ చేసుకున్నాక, అందరూ వివాహానికి సిద్ధంగా ఉంటారు ఈ లోపులో వరుడు బంధుమిత్రులతో సహా విచ్చేస్తాడు అపుడు కన్యాదాత వరునికిచ్చే ఆతిథ్యానికే 'మధుపర్కము' అని పేరు కన్యాదాత వరుణ్ణి నారాయణస్వరూపునిగా భావించాలి ''జామాతా స్వయం విష్ణుః" అని శాస్త్రం చెపుతోంది పైగా దానం ఎంతగొప్పదైనా, ఆదరపూర్వకంగా చేయకపోతే వ్యర్థమే గదా! కన్యాదాత వరునకు దర్భలచే పవిత్రమైన ఆసనాన్ని ఇస్తాడు అతడు దానిపై కూర్చున్నాక, ముందు అతని కుడికాలిని, తరువాత ఎడమకాలిని కడుగుతాడు కాని అట్లు చేయుట వలన వరుని తేజస్సు నష్టమవుతుంది పెద్దలు నమస్కారాదికం చేస్తే పిల్లల తేజస్సు క్షీణించ కుండునా? దీనిని నివారించుటకై వరుడు కొన్ని మంత్రాల్ని పఠించి, తన తేజస్సును రక్షించుకుంటాడు

"మయి మహో మయి యశో మయీంద్రియం వీర్యమ్"
"నా యందలి తేజస్సు, కీర్తి, బలము స్థిరముగా నుండుగాక!"

కన్యాదాత ఇచ్చిన అర్ఘ్యాన్ని వరుడు సమంత్రకంగా స్వీకరిస్తాడు

"ఆ మాగన్ యశసా వర్చసా నగ్ంసృజ పయసా తేజసా చ।
తం మా ప్రియం ప్రజానాం కుర్వధిపతిం పశూనామ్"॥

ఓ ఉదకమా! నీవు నావద్దకు వచ్చుదానవై, నన్ను కీర్తి, వర్చస్సు, పశు సంపద కలవానినిగా చేయుము. అందరికి ఇష్టుడనగునట్లు చేయుము.

"విరాజో దోహో౽సి విరాజో దోహమశీయ మమ పద్యాయ విరాజ" ।

ఓ ఉదకములారా! మీవలననే లోకములో అన్నము కలుగుచున్నది అట్టి యన్నముచే నేను, నావారు రక్షింపబడుచున్నారు

తరువాత కన్యాదాత దధిమధుమిశ్రమాన్ని (మధుపర్కం) ఇస్తాడు వరుడు దానిని సమంత్రకంగా అభిమంత్రించి, స్వీకరిస్తాడు అపుడు వరుడు చెప్పే మంత్రాలు వరుసగా ఇవి

"త్రయ్యై విద్యాయై యశో౽సి యశసో యశో౽సి బ్రహ్మణో దీప్తిరసి। తం మా ప్రియం ప్రజానాం కుర్వధిపతిం పశూనామ్।"

ఓ మధుపర్కమా! నీవు మూడు వేదములను ప్రకాశింపజేసి, కీర్తి నొసగెదవు నన్ను ప్రజలకిష్టునిగను, పశు సంపద గలవానినిగను జేయుము

'అమృతోపస్తరణమసి।'

నీవు అమృతమునకు ఆధారమైతివి

"యన్మధునో మధవ్యం పరమమన్నాద్యం వీర్యమ్। తేనాహం మధునో మధవ్యేన పరమేణాన్నాద్యేన వీర్యేణ పరమో౽న్నాదో మధవ్యో౽సాని॥"

"తేనెకు అన్నమును జీర్ణింపజేయు శక్తి గలదు కాన తేనె బలకారి, పుష్టికారి ఆ తేనెయొక్క తియ్యదనము చేత నేను దీప్తాగ్ని కలవాడను, అందరితో మధురముగా మాట్లాడే స్వభావము గలవాడను అగుదును గాక।"

"అమృతాపిధానమసి"

"నీవు అమృతముచే కప్పబడితివి "

ఈ మంత్రాలలో వరుడు తాను మధురముగా మాట్లాడే స్వభావం కలిగి, అందరికీ ఇష్టుడు కావాలని కోరుకుంటాడు గృహస్థాశ్రమంలో ప్రవేశించే వ్యక్తి ఆవిధంగా తనను తీర్చిదిద్దుకోవాలి

## మహాసంకల్పము

మనం చేసే పనులన్నీ సంకల్పపూర్వకంగానే ఉంటాయి కానీ, ఏదైనా ధర్మకార్యం చేసేముందు మాత్రం ఈసంకల్పాన్ని శాస్త్రోక్త విధానంతో చేస్తాము అనగా, పరమేశ్వరుణ్ణి సవినయంగా ప్రార్థించి, చేయబోయే ధర్మాన్ని ఈశ్వరాజ్ఞగా భావిస్తూ, పరమేశ్వరుని అనంతకాల స్వరూపాన్ని విస్మయావిష్ట హృదయంతో గుర్తు చెసుకుంటూ, గోత్రనామాల్ని చెప్పి, ''ఈ కర్మను నేను ఈశ్వరార్పణబుద్ధితో చేస్తున్నాను'' అని సంకల్పిస్తాము

"శ్రీ మహావిష్ణోరాజ్ఞయా అద్య బ్రహ్మణః ద్వితీయపరార్ధే శ్వేత వరాహకల్పే వైవస్వతమన్వన్తరే కలియుగే ప్రథమపాదే-శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం కర్మ కరిష్యే ''

సంకల్పంలో కాలచక్రస్వరూపాన్ని స్మరిస్తాము

| | | |
|---|---|---|
| కలియుగము | 4,32,000 | సంవత్సరములు |
| ద్వాపరయుగము | 8,64,000 | ,, ,, |
| త్రేతాయుగము | 12,96,000 | ,, ,, |
| కృతయుగము | 17,28,000 | ,, ,, |
| మహాయుగము | 43,20,000 | |

కల్పము = 1,000 మహాయుగములు

బ్రహ్మకు 1 రోజు = 2 కల్పములు

ఇపుడు బ్రహ్మవయస్సు 51 సంవత్సరములు.

ఈ విధమైన కాలచక్రమును స్మరిస్తూంటే, మానవ జీవితము బుద్బుద ప్రాయమనే సత్యం స్ఫుటంగా అవగతమవుతుంది ఈ చిన్న జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలి అనే సంస్కారం కలుగుతుంది.

కన్యాదానము మొదలగు ప్రముఖ పుణ్యకర్మల నాచరించే ముందు పఠించే

సంకల్పం కొంత పెద్దదిగా ఉంటుంది దీన్నే మహాసంకల్పం అంటారు దీనిలో మనం తెలుసుకోదగ్గ అంశాలు చాలా ఉన్నాయి

ఈ సంకల్పం సృష్టిక్రమవర్ణనంతో ప్రారంభం అవుతుంది పరమేశ్వరుని శక్తి అచింత్యము, అనంతము అట్టి పరమేశ్వరుని అనుగ్రహముచే అవ్యక్త ప్రకృతి, మహత్, అహంకారము, పంచభూతములు ఇత్యాది క్రమంలో ఈ బ్రహ్మాండసృష్టి జరిగింది ఈ బ్రహ్మాండంలో పదునాల్గు భువనాలలో ఒకటైన భూఖండంలో ఈ పుణ్యకార్యం జరుగుతోంది

"అస్య శ్రీమదాదినారాయణస్య అచింత్యాపరిమితశక్త్యా ప్రకృతిమహదహంకార పృథివ్యప్తే జోవాయ్వాకాశాది

మానవుని ఇంద్రియాలకే గాక, మనస్సుకు కూడ అందని పరిమాణం గల ఈ జగతి ఆ పరమేశ్వరుని అనంత స్వరూపంలో ఒక అంశం మాత్రమే ఈ బ్రహ్మాండంలో ఒక చిన్న శకలమనదగ్గ భూఖండంలో ఒక మూలనున్న మానవుడే పాటి వాడు? మహాసంకల్పాన్ని పఠించే సమయంలో ఇట్టి భావాలు మన హృదయాల్ని వినయంతో భక్తితో నింపుతాయి

మహాసంకల్పంలో పవిత్రభారతభూమి అతి మధురంగా వర్ణింపబడింది మన మాతృభూమి అమరావతి, అశోకవతి, భోగవతి, కాశీ, కాంచి, అవంతి, ఇత్యాది పుణ్యనగరాలతో ప్రకాశిస్తోంది ఈ పవిత్రభూమిలో మహేంద్ర, మలయ, సహ్య, శక్తిమత్, ఋక్ష, వింధ్య, పారియాత్రములనే ఏడు కులపర్వతాలు ఉత్తుంగ శిఖరాలతో అంబరాన్ని చుంబిస్తూ, ఈ భూమి స్వర్గలోకముకంటె గొప్పదని ప్రకటిస్తున్నాయి

అంగ వంగ కళింగాద్యనేక భాషా భేదమున్నను, ఇచటి సాంస్కృతిక, ధార్మిక పరంపర ఒక్కటే అనే పవిత్రభావన ఈ సంకల్పంలో ప్రస్ఫుటమవుతూ ఉంటుంది. భాగీరథీ, గౌతమీ, నర్మదా, యమునా, కృష్ణవేణీ, బాహుదా, భీమరథీ, తుంగభద్రా, తామ్రపర్ణీ, చంద్రభాగా, కౌశికి, గంగా, గండకి, గోమతీ, పినాకినీ, సరయూ, సరస్వతీ, కావేరీ ఇత్యాది అనేక పుణ్యనదులు ఈ భూమిని సస్యశ్యామలంగాను, భక్తులను పాపపంకిల విరహితులుగాను చేస్తూ ప్రవహిస్తున్నాయి

ఈ విధంగా సాగే మహాసంకల్పాన్ని విన్న సభాసదుల హృదయాలలో రాష్ట్రీయ భక్తిభావన వికసిస్తుంది National Integration Council చేసే తీర్మా నాలకంటె ఎక్కువ ప్రభావం ఈ సంకల్పానికుంది ఆసేతుహిమనగం విస్త రించిన హిందూసమాజాన్ని ఏకసూత్రబద్ధం చేసే సనాతన సంస్కృతికి ప్రతీకయే ఈ సంకల్పం

మానవుడు కామక్రోధ లోభ మోహ మద మాత్సర్యములనే అరిషడ్వ ర్గాన్ని జయించాలని, అందుకు సాధనంగా యమ నియమాద్యష్టాంగ యోగాన్ని అభ్యసించాలని ఈ సంకల్పం మనకు గుర్తు చేస్తుంది

''కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాద్యరిషడ్వర్గ రహి తానాం యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణా సమాధ్యష్టాంగ యోగ నిరతానాం ''

మహాసంకల్పంలో దశావతారాల్ని కూడా స్మరిస్తాము

''మత్స్య కూర్మ వరాహ నారసింహ వామన రామత్రయ కృష్ణ కల్క్యాఖ్యైర్దశావతారైర్విరాజితే

పరమేశ్వరుడు స్వయముగా భూమిపై అవతరించినది భారతదేశంలోనే ప్రపంచంలోని ఇతర భాగాలలో పరమేశ్వరుని దూత లేక కుమారుడు అవతరించెనే గాని, స్వయముగా పరమేశ్వరుడే పలుమారులవతరించి ధర్మరక్షణ చేసిన పవిత్రభూమి మన మాతృభూమి ఇట్టి కర్మభూమిని ధర్మబద్ధంగా, ప్రజారంజ కంగా పరిపాలించిన పదునార్గురు చక్రవర్తుల్ని కూడా సంకల్పంలో స్మరిస్తాము

'రామ శిబి రన్తి గయ నృగు పృథు మాంధాతృ యయాతి మరుద్దిలిప భరతాంబరీష శశిబిందు భగీరథ పరశురామేతి షోడశమహా రాజైః పరిపాలితే "

ఈ ప్రకృతిలో వృక్షాలు, పక్షులు, అడవిజంతువులు ఇత్యాది ప్రాణులన్ని టికీ సముచితస్థానం ఉంది వీటిలో ఏ ఒక్కదానికి నష్టం కలిగినా ప్రకృతి తన సమతౌల్యాన్ని కోల్పోతుంది. అపుడు మానవజాతి మనుగడకే ముప్పు వాటిల్లు తుంది పారిశ్రామికాభివృద్ధి యొక్క మోజులో పడిన ఆధునిక మానవుడు ఈ

సత్యాల్ని ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నాడు కాని ఈ సత్యాల్ని వేదాలు, పురాణాలు ఎలుగెత్తి చాటుతూనే ఉన్నాయి మహాసంకల్పంలో వీటికి సంబంధించిన మధుర మైన వర్ణన చేయబడింది

"వివిధ సురతరు క్రీడావన బహుళ పరిమళ భ్రమద్భ్రమర పటల ఝంకార కరంబిత కలకంఠ కూజిత కేకీకృత కేకారవ ముఖరీ కృత సారతర తరుషండే"

కల్పవృక్షములా యనదగ్గ అనేక మహావృక్షములతో ప్రకాశించే ఉద్యా నము భ్రమరముల ఝీంకారములతో, కోయిలల మధురశబ్దములతో, నెమళ్ళ కేకాధ్వనులతో నినదిస్తోంది ఇట్టి ఉద్యానాలతో ప్రకాశించే భారతభూమిలో ఈ వివాహమనే పుణ్యకర్మ జరుగుతోంది

మహాసంకల్పంలో సంవత్సరము, అయనము, ఋతువు, మాసము, పక్షము, తిథి, వారము, యోగము, కరణముల నామాల్ని స్మరిస్తాము పవిత్రము లగు ఈ నామములను స్మరించుట యనగా కాలస్వరూపుడగు పరమేశ్వరుని ఆరా ధించుటయే యని శాస్త్రిలు చెప్తున్నాయి ఆఖరుగా కన్యాదాత "సాలంకృత కన్యాదానమహం కరిష్యే (నేను అలంకారములతో కూడిన కన్యను వరునకు అందించుచున్నాను) అని ముగిస్తాడు

మహాసంకల్పము యొక్క మహిమను మరీచిస్మృతి ఇల్లా వర్ణించింది

"కన్యాధానే నదీస్నానే తులాదానాదిషు ద్విజః।
ప్రాయశ్చిత్తేషు యజ్ఞాదౌ వ్రతాదిషు విశేషతః॥
ఏతదాదిషు సర్వత్ర మహాసంకల్పమాదరాత్ ।
కృత్వా యత్కురుతే కర్మ తదానన్త్యాయ కల్పతే ॥

కన్యాదానము, తులాదానము, తీర్థస్నానము, ప్రాయశ్చిత్తము, యజ్ఞ ములు, వ్రతములు మొదలగు పవిత్రకార్యములలో మహాసంకల్పాన్ని భక్తి శ్రద్ధలతో పఠించినచో, అట్టి కర్మలు అనంతఫలాన్ని ఇస్తాయి

## గోత్రప్రవరలు

బంధువులు, మిత్రులు వివాహమండపంలో సమావేశమవుతారు అపుడు

పురోహితులిద్దరు రెండు కుటుంబాలలోని వృద్ధుల సహాయంతో రెండు వంశాల పరంపరని ఉచ్చైస్స్వరంతో పరిస్తారు వధూవరులనుండి వెనుకకు మూడు తరాలవరకు పేర్లు, గోత్రప్రవరలు ప్రకటిస్తారు దీనివలన రెండు ప్రయోజనాలు సిద్ధిస్తాయి వివాహానికి విచ్చేసిన పెద్దలందరికీ ఈ రెండు వంశాల మహాపురుషుల గురించి తెలుస్తుంది వధూవరులకు వారివారి వంశముల మహిమను గుర్తు చేయుట ద్వారా ''అట్టి గొప్ప వంశములో పుట్టిన మేము వంశమర్యాదను నిల బెట్టాలి, ధర్మమార్గంలో సంచరించాలి'' అనే స్ఫూర్తి కలుగుతుంది దాని వలన వారి గృహస్థధర్మం వీర్యవత్తరం అవుతుంది

ఈ వంశపరంపర యొక్క వర్ణనను వాల్మీకి మహర్షి శ్రీమద్రామాయణం బాలకాండలో సీతారామ కల్యాణఘట్టంలో అతిమధురంగా వివరించేరు రామా యణం యొక్క లోకప్రియత కారణంగానే ఈ ఆచారం హిందూవివాహాల్లో చోటుచేసుకుందని తోస్తుంది

## కన్యాదాన మాహాత్మ్యము

పద్మపురాణం ఒక్కొక్క యుగానికి ఒక్కొక్క ప్రశస్త ధర్మాన్ని బోధించింది

"తపః కృతే ప్రశంసంతి త్రేతాయాం జ్ఞానమేవ చ ।
ద్వాపరే యజ్ఞమిత్యాహుర్దానమేకం కలౌ యుగే॥"

కృతయుగంలో తపస్సు ప్రశస్తమైనది అల్లాగే త్రేతాయుగంలో జ్ఞానము, ద్వాపరయుగంలో యజ్ఞము ప్రశస్తములు కలియుగంలో మాత్రం దానము ప్రశస్తమైన ధర్మము అనేక మహాదానాలు పురాణాల్లో వర్ణింపబడ్డాయి వాటిల్లో కన్యాదానానికి ప్రముఖమైన స్థానం ఉంది మత్స్యపురాణం పదహారు మహా దానాల్ని కీర్తించింది వాటిలో కన్యాదానం ఒకటి కన్యాదాన సమయంలో పఠించే మంత్రాల్ని, మహాసంకల్పాన్ని పరిశీలిస్తే మనకు కన్యాదానం ఎంతటి మహిమాన్వితమో అవగతమవుతుంది

"మమ అనాద్యవిద్యావాసనయా ప్రవర్తమానేఽస్మిన్ సంసార చక్రే జన్మప్రభృత్యేతత్క్షణపర్యంతం సంభావితానాం పాపానాం

కామ క్రోధ లోభమోహమద మత్సరైస్సంభావితైః మహాభాగవతాపచార భగవదపచారైర్మిలితానాం  మమ దురితక్షయద్వారా  "

జీవుడు అనాదినుండియు అవిద్యాకామకర్మవశుడై అనేక యోనులలో జన్మిస్తూ ఉంటాడు మానవదేహాన్ని పొంది కూడా కామక్రోధాద్యరిషడ్వర్గముచే పరాభూతుడై భగవద్భక్తులయెడ, భగవంతునియెడ అనేక అపచారాల్ని ఆచరిస్తూ ఉంటాడు ఇటువంటి పాపాలన్నిటినుండి విముక్తి పొందుటకై నేను కన్యాదానం చేస్తున్నానని కన్యాదాత సంకల్పిస్తాడు

"గంగావాలుకాభిస్సప్తర్షి మండలపర్యంతం  బ్రహ్మలోకే నివాస సిద్ధ్యర్థం

అనేక కోట్ల సంవత్సరాలు సత్యలోకంలో నివసించె యోగ్యతనిచ్చే పుణ్యాన్ని పొందుటకై నేను కన్యాదానం చెస్తున్నానని యజమాని భావన చేస్తాడు

"త్రిగుణీకృతాఽగ్నిష్టోమా  శతక్రతుపుణ్యఫలావాప్త్యర్థం"

వేదోక్తములైన అగ్నిష్టోమాది మహాపుణ్యక్రతువులనాచరిస్తే లభించే దాని కంటె మూడు రెట్లు పుణ్యం కన్యాదానం వలన లభిస్తుంది ఇంతేగాక—"

"మయా సహ దశ పూర్వేషాం దశాపరేషాం పితౄణాం శాశ్వత బ్రహ్మలోకనివాససిద్ధ్యర్థం  "

తానే కాకుండా పదితరాల పూర్వీకులు, పదితరాల తరువాతివారు కూడ శాశ్వత సత్యలోక నివాసాన్ని పొందేటంతటి మహాపుణ్యం కన్యాదానంవలన లభిస్తుంది కన్యాదానంవలన ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధపురుషార్థాలు సిద్ధించి, మానవజన్మయే చరితార్థమవుతుందని కన్యాదాత పఠించే శ్లోకాలలో, మంత్రాలలో అవగతమవుతుంది

"కన్యాం సాలంకృతాం సాధ్వీం సుశీలాయ సుధీమతే ।
ప్రయతోఽహం ప్రయచ్ఛామి ధర్మకామార్థసిద్ధయే॥
త్వద్దానాన్మోక్షమాప్నుయామ్॥"

పద్మపురాణం సాలంకృత కన్యాదానమహిమను ఇల్లా వర్ణించింది.

"సర్వాభరణసంయుక్తాం కన్యకాం యో దదాతి చ।
తేన దత్తా ధరా సర్వా సశైలవనకాననా॥"

"సమస్త సంపదలతో విలసిల్లే భూమండలాన్ని అంతటిని దానం చేసిన ఫలం సాలంకృతకన్యాదానం వలన లభిస్తుంది"

## కన్యాదానము

నారికేళఫలపుష్పాక్షతహిరణ్య సహితమగు కన్యయొక్క కుడిచేతిని తల్లిదండ్రులు వరుని కుడిచేతిలో ఉదకపూర్వకంగా సమర్పిస్తారు వరుడు తూర్పునకు, కన్య, ఆమె తండ్రి పశ్చిమానికి, తల్లి ఉత్తరానికి అభిముఖంగా కూర్చుని కన్యాదానం చేస్తారు

దానమేదైనా "తుభ్యమహం సంప్రదదే న మమ" అని పలికి దాత ప్రతిగ్రహీతకు సమర్పిస్తాడు అనగా "నేను నీకు దానమిస్తున్నాను ఇకపై ఈ వస్తువుమీద నాకేమియు అధికారము లేదు" అని అర్థం కాని కన్యాదానంలో మాత్రం దాత "తుభ్యమహం సంప్రదదే" అని మాత్రమే అంటాడు "న మమ" అనడు ఏలననగా, వివాహం అయినంతమాత్రాన అమ్మాయికి, తల్లిదండ్రులకు సంబంధం తెగిపోదు పైగా ప్రేమానురాగాలు పెరుగుతాయి అమ్మాయి తల్లిదండ్రుల ఇంటికి అప్పుడప్పుడు వచ్చి వెళ్తూనే ఉంటుంది కాన, "న మమ" అనరాదు

వరుడు కన్యను ప్రతిగ్రహిస్తూ కొన్ని మంత్రాలు చెప్తాడు వీటికి ప్రతిగ్రహమంత్రాలని పేరు

"దేవస్య త్వా సవితుః ప్రసవేఽశ్వినోర్బాహుభ్యాం పూష్ణోహస్తాభ్యాం ప్రతిగృహ్ణామి"

"సూర్యభగవానుని యనుజ్ఞతో అశ్వినీదేవతల బాహువులతో పూషన్ దేవతయొక్క హస్తములతో స్వీకరిస్తున్నాను" వివాహబంధం ఎంతటి పవిత్రమైనదో అవగతమవటానికి ఈ ఒక్క మంత్రం చాలు

"రాజా త్వా వరుణో నయతు దేవి దక్షిణే ప్రజాపతయే కన్యాం తేనా మృతత్వమశ్యామ్। వయో దాత్రే। మయో మహ్యమస్తు ప్రతి గ్రహీత్రే। క ఇదం కస్మా అదాత్। కామః కామాయ। కామో దాతా కామః ప్రతిగ్రహీతా।కామగ్ం సముద్రమావిశ।కామేన త్వా ప్రతిగృహ్ణామి। కామైత త్తే। ఏషా తే కామ దక్షిణా। ఉత్తానస్త్వాం గీరసః ప్రతిగృహ్ణాతు"

పశ్చిమదిగధీశుడగు వరుణుడు ఈ కన్యను ప్రజాపతికొరకు (ప్రజాపతి స్వరూపుడగు వరునికొరకు) అర్పించుగాక। అట్లు చేయుట వలన నేను అమృతత్వమును (ధర్మానుష్ఠానలభ్యమగు పుణ్యలోకము) పొందెదను దాతయగు తండ్రి స్వర్గాది పుణ్యలోకములు పొందునట్లు చేయు సామర్థ్యమీ కన్యకు గలదు ఈమె ప్రతిగ్రహీతనగు నా జీవితమును సుఖమయము చేయగలదు ఈమెను ప్రజాపతి ప్రజాపతికొరకు ఇచ్చుచున్నాడు (అనగా దాత, ప్రతిగ్రహీత వీరిద్దరి అంతఃకరణములను ప్రేరేపించు పరమేశ్వరుడే దానముచేయువాడు, ప్రతిగ్రహము చేయువాడు) స్వర్గాది పుణ్య ఫలార్థియై దాత దానము చేయుచున్నాడు ధర్మానుష్ఠానము ద్వారా స్వర్గాదిపుణ్యలోకములను, ఇహలోకసుఖమును కూడ కోరువాడై వరుడు ప్రతిగ్రహించుచున్నాడు కాన కామము అనగా కోరికయే గాత, ప్రతిగ్రహీత కూడా

ఈ ప్రతిగ్రహమంత్రాలలో దాన, ప్రతిగ్రహాల గురించిన సరియగు కల్పన ఈయబడింది మనకు సమాజంలో రెండు రకాల ప్రవృత్తులు కనబడ తాయి కన్యాదానంలో ప్రతిగ్రహీతయగు వరుడు గొప్పవాడుగను, దాతయగు కన్యాపిత ఒదిగి మదిగి ఉండాల్సినవాడుగను పరిగణించడం ఒకటి ఇతర దానాలలో దాత గొప్పవాడుగను, ప్రతిగ్రహీత చులకనైనవాడుగను పరిగణించడం రెండవది ఈ రెండు ప్రవృత్తులు కూడ సరి కావని, దాత ప్రతిగ్రహీత లిద్దరిలోనూ ఉండే ప్రేరకమైన సాక్షి ఏకరూపమే ననియు, దానప్రతిగ్రహాలు రెండింటికీ కూడ కామమే మూలమనియు, మనకి మంత్రాలలో స్పష్టమవుతోంది కాన, ఎట్టిపరిస్థితులలోనైనా దాతగాని, ప్రతిగ్రహీతగాని అహంకారాన్ని, గర్వాన్ని కలిగియుండుట సరిగాదు

కన్యాదాత వరునికి ఒక నియమాన్ని విధిస్తాడు

"ధర్మే చ అర్థే చ కామే చ నాతిచరితవ్యా"।

''నీవు ధర్మార్థకామములనే త్రివర్గము విషయములలో ఈమెను అతిక్ర మించరాదు '' అనగా ''నీవు ఆచరించే ధర్మకార్యాలన్నిటినీ ఈమెతో కలిసియే ఆచరించు ధనం విషయంలో ఈమెకు ద్రోహం చేయకు నీవు ఈమెయందు మాత్రమే అనురాగాన్ని, ప్రేమని కలిగి ఉండాలి ఏకపత్నీవ్రతుడవు కావాలి" అని కన్యాదాత యొక్క అభిప్రాయం వరుడు "నాతిచరామి'' అంటూ తన అంగీకారాన్ని తెలుపుతాడు ఈ మాటలను కన్యాదాత, వరుడు ముమ్మారు ఉచ్చరిస్తారు ఆ క్షణం నుండి వరుడు సమస్త సంకల్పాల్లోను "ధర్మపత్నీ సమేతః'' అనే విశేషణాన్ని జీవితాంతం ఉచ్చరిస్తాడు ''త్రిషత్యా హి దేవాః" అని వేదం చెప్తోంది అనగా, ముమ్మారు ఉచ్చరించిన మాటను దేవతలు సత్య ముగా పరిగణిస్తారు ఈ కారణంగా, వాక్యాల్ని ముమ్మారు ఉచ్చరిస్తారు కన్యా దాన సందర్భంగా కన్యాదాత కొన్ని ఇతర దానాల్ని కూడా చేస్తాడు

## సుముహూర్తము

జ్యోతిశ్శాస్త్ర విద్వాంసులచే నిర్ణీతమైన ముహూర్తానికి ముందుగా పురో హితులు వివాహమంగళశ్లోకాల్ని పఠిస్తారు బ్రహ్మవిష్ణుమహేశ్వరులు, ఇతర దేవతలు, ఋషులు, ధర్మాత్ములైన అంబరీష శ్రీరామాది చక్రవర్తులు నూతన దంపతులకు క్షేమం కలిగించాలని ఈ శ్లోకాలలో ప్రార్థిస్తారు ఆదిత్యాది నవ గ్రహాలు, మేషాదిరాశులు, నక్షత్రములు కూడా వధూవరులకు సమస్త మంగళ ములను అనుగ్రహించెదరు గాక యని ప్రార్థిస్తారు ఈ మంగళ శ్లోకాలలో రెండింటిని మనం గమనించాలి

> "అశ్వత్థో బదరీ చ చందనతరుర్మందారకల్పద్రుమౌ
> జంబూనింబకదంబ చూతసరళా వృక్షాశ్చ యే క్షీరిణః ।
> సర్వే తే ఫలమిశ్రితం వనచయం వైభ్రాజితం భ్రాజితం
> రమ్యం చైత్రరథం సునందనవనం కుర్వంతు వాం మంగళమ్॥"

వైదిక సంస్కృతిలో ప్రకృతికి, వృక్షసంపదకు గల ప్రాధాన్యం ఎట్టిదో ఈశ్లోకంలో మరొక్కసారి స్పష్టమౌతోంది

"గంగా సింధుస్సరస్వతీ చ యమునా గోదావరీ నర్మదా
కృష్ణా భీమరథీ చ ఫల్గుసరయూ శ్రీగండకీ గోమతీ।
కావేరీ కపిలా ప్రయాగనిరతా వేత్రావతీత్యాదయః
సద్యశ్శ్రీహరిపాదపంకజభవాః కుర్వంతు వాం మంగళమ్॥"

ఈ శ్లోకంలో అఖండభారతభావన మరొక్కసారి దృఢం చేయబడు తోంది

పురోహితులు సుముహూర్తానికి ముందు 'చూర్ణిక'యని ప్రసిద్ధి గాంచిన సంస్కృతగద్యను కూడ పఠిస్తారు సమస్తదేవతలు, శ్రీమహావిష్ణువు, గౌరీమనో వల్లభుడైన పరమశివుడు, సూర్యచంద్రులు, హరిశ్చంద్ర శ్రీరామచంద్రాది చక్ర వర్తులు, మార్కండేయ వసిష్ఠాది మహర్షులు, అరుంధతీ లోపాముద్రా సీతా సావిత్రీత్యాది మహాపతివ్రతలు, గంగా యమునాది నదీమతల్లులు, శ్రీశైల కైలాసాది శైలములు, అశ్వత్థ పలాశాది యజ్ఞియములగు వృక్షములు, కమల మల్లికాది పుష్పజాతులు, వజ్ర వైడూర్యాది నవరత్నములు (వాటి అధిష్ఠాన దేవతలు), ఋగ్యజుస్సామాథర్వణవేదములు, శిక్షా వ్యాకరణాది వేదాంగములు, ధర్మశాస్త్ర పురాణ న్యాయాదిశాస్త్రములు, ధర్మపత్నీ సమేతులైన వేదవేత్తలు, దధి మధు జీరకగుడాది మంగళద్రవ్యములు (సర్వత్ర తత్తదభిమాని దేవతలు), ఈ వధూవరులకు వరములనిచ్చుగాక యని 'చూర్ణిక'లో ప్రార్థిస్తారు

"సుముహూర్తం సమీపిస్తోంది సావధానంగా ఉండండి'' అని పురో హితులు హెచ్చరికలు చేస్తారు మంగళద్రవ్యములైన జీలకర్ర బెల్లములతో తయారుచేసిన ముద్దను సుముహూర్తము రాగానే వధూవరులు శిరసులపై పర స్పరము సమంత్రకంగా ఉంచుతారు

''ధ్రువం తే రాజా వరుణో ధ్రువం దేవో బృహస్పతిః॥ ధ్రువం త ఇంద్రశ్చాగ్నిశ్చ రాష్ట్రం ధారయతాం ధ్రువమ్॥" ఇత్యాది మంత్రాలతో నూతన వధూవరులు శాశ్వతకాలం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వదిస్తారు

సుముహూర్తమనగా కొద్దిక్షణముల కాలమే గదా! ఆ సమయములో చేయ దగు ప్రధాన సంస్కారమేదియను విషయములో వివిధాభిప్రాయాలున్నాయి

సమంత్రకంగా గుడజీరకాది మంగళద్రవ్యములను వధూవరులు తమతమ శిరస్సులపై ఉంచుటయే సుముహూర్త ప్రధానసంస్కారముగా అనేకులు తలచి, అట్లే చేయుచున్నారు మరికొందరు మంగళద్రవ్య నిధానపూర్వకముగా సమంత్రక వధూసమీక్షణమే సుముహూర్త కర్తవ్యమని తలచుచున్నారు సమంత్రక పాణిగ్రహణమే వివాహ ప్రధానసంస్కారము గాన, అదియే సుముహూర్త కర్తవ్యమని మూడవ పక్షము పరమశ్రద్ధేయులు సాంగస్వాధ్యాయ భాస్కర బ్రహ్మశ్రీ సన్నిధానం లక్ష్మీనారాయణమూర్తి శర్మగారు "సంస్కార రత్నాకరః" అను గ్రంథములో ఈ పక్షములన్నిటిని కూలంకషముగా పరిశీలించి, సమంత్రక పాణిగ్రహణమే సుముహూర్త కర్యవ్యమని సోపపత్తికముగా నిరూపించియున్నారు ఆచారమును సశాస్త్రీయముగ మార్పు చేసుకొనుటయూ ధర్మమే యగునని అభిజ్ఞులు గ్రహించి, వివాహసుముహూర్త కాలములో సమంత్రక పాణి గ్రహణమును నిర్వర్తించుటయే సముచితమని తోచుచున్నది ఇది విద్వాంసులు తప్పక పరిశీలించవలసిన అంశము

## వధూసమీక్షణము

పైన చెప్పిన విధంగా వధూసమీక్షణం కూడా ముఖ్యమైన సంస్కారాలలో ఒకటి వరుడు వధువును చూస్తూ కొన్ని మంత్రాల్ని పఠిస్తాడు

"అభ్రాతృఘ్నీం వరుణాపతిఘ్నీం బృహస్పతే ।
ఇన్ద్రాపుత్రఘ్నీం లక్ష్మ్యంతా మస్యై సవితస్సువ ॥"

"ఓ పరమాత్మా! ఈమె తోడబుట్టిన వారు, భర్త, సంతానము అందరు చిరకాలం జీవించే సౌభాగ్యాన్ని ఈమెకు ఇమ్ము "

"అఘోరచక్షురపతిఘ్న్యేధి శివా పతిభ్యస్సుమనాస్సువర్చాః।
జీవసూర్దేవకామా స్యోనా శం నో భవ ద్విపదే శం చతుష్పదే॥"

"ఈమె దృష్టి శాంతమైనది, మంగళకరమైనది ఈమె సౌభాగ్యముచే భర్తనగు నేను చిరకాలం జీవిస్తాను నా సోదరులు శుభాలను పొందుతారు ఓ చిన్నదానా! నీ మనసు మంచిది, నీవు గొప్ప తేజస్సు కలదానవు నీవు

సత్సంతానాల్ని పొందుతావు దేవతల నారాధిస్తావు నీ మూలంగా మా ఇంట్లోని మనుష్యులేకాదు, గోవులు మొదలగు ఇతరప్రాణులు కూడా సుఖశాంతులను పొందుతారు "

వధూబంధువుల కుద్దేశింపబడిన ఒక మంత్రాన్ని వరుడు పఠిస్తాడు

"జీవాగ్ం రుదన్తి వినిమయన్తే అధ్వరే
దీర్ఘామను ప్రసితిం దీధి యుర్నరః ।
వామం పితృభ్యో య ఇదగ్ం సమేరిరే మయః
పతిభ్యో జనయః పరిష్వజే॥"

నూతన దంపతులమగు మా యిద్దరి ప్రేమానుబంధము గొప్పది మా యీ వివాహము పితృదేవతలకు కూడ కాంక్షింపదగినది మీ ప్రేరణచేతనే నేనీ సుందరిని బడయు భాగ్యాన్ని పొందేను ఈ శుభసమయంలో మీరు దుఃఖించడం సముచితం కాదు పుట్టిన నాటి నుండి తమ వద్ద పెరిగిన కుమార్తె ఈ నాడు మరొక ఇంటి కోడలుగా వెళ్ళబోతూంటే, ఆమె తల్లిదండ్రులకు, బంధువులకు దుఃఖం కలగటం సహజం కాళిదాసు రచించిన అభిజ్ఞానశాకుంతలము లో కణ్వమహర్షి శకుంతలను కన్నవాడు కాకపోయినా, పెంచినవాడు మాత్రమే అయినా, తాను వీతరాగుడే అయినా, ఆమె అత్తవారింటికి వెళ్ళే సమయంలో గొప్ప దుఃఖాన్నే అనుభవిస్తాడు అపుడు కణ్వుడు ఇల్లా అంటాడు

"పీడ్యంతే గృహిణః కథం ను తనయావిశ్లేషదుఃఖైర్నవైః।"

అనగా, కనిపెంచిన తల్లిదండ్రులు తమ కుమార్తెను అత్తవారింటికి పంపుతూ ఎంతటి దుఃఖాన్ని అనుభవిస్తారో గదా।" ఇట్టి సహజశోకానికి గురి కాబోయే తల్లిదండ్రులనుద్దేశించి వరుడు పై మంత్రాన్ని పఠిస్తాడు

## పవిత్రజలములతో వధువును అభిషేకించుట

దర్భలతో తయారుచేసిన 'ఇణ్వము' అనే వలయాన్ని వధువు శిరస్సుపై ఉంచి, కాడిమొక్క ఎడమ రంధ్రములో సువర్ణము నుంచి, దానిగుండా నీటిని

వధువుపై పడునట్లు సమంత్రకంగా ప్రోక్షిస్తారు వధువు ఆయురారోగ్యా లతో సుఖంగా విలసిల్లడంకోసం ఈ కర్మ ఉద్దేశింపబడింది ఈ సంస్కారానికి అధర్వవేదంలోని ఒక గాథ ఆధారం

అత్రిమహర్షి యొక్క కుమార్తె బ్రహ్మవాదిని యను నామె శ్వేతరోగ ముండుటచే ఆమె వివాహానికి నోచుకోలేదు ఆమె ఒకప్పుడు నదిలో స్నానం చేస్తూ, కాలు జారి ప్రవాహంలో కొట్టుకొని పోతూండగా, అదే ప్రవాహంలో కొట్టుకవస్తున్న సోమలత కనబడెను ఆమె ఆ లతను కష్టముతో పట్టుకొని, దంతములతో నమిలి, ఆ రసాన్ని ఇంద్రునకు సమర్పించెను ఆమె భక్తికి, వైదికసంస్కారానికి ఇంద్రుడు సంతసించి, స్వయముగా ప్రత్యక్షమై ఆమెను రక్షిస్తాడు అంతేగాక, పైన వర్ణించిన రీతిని ఆమెను పవిత్రజలాలతో అభిషే కిస్తాడు ఆమెకున్న శ్వేతరోగం వెంటనే మటుమాయమై సూర్యతేజస్సు లభించెను ఇదీ గాథ ఈ విధంగా వధువును అభిషేకించుటవలన ఆమె సూర్యుని వలె నిత్యప్రకాశము గలది యగునని వేదము బోధిస్తోంది

"శం తే హిరణ్యగ్ం సము శం తాపశ్శం తే మేధీభవతు శం యుగస్య తృద్మ శం త అపశ్శతపవిత్రా భవంత్వథాపత్యాతన్వగ్ం సగ్ంస్పృజస్వ॥"

''ఓ చిన్నదానా ! ఈ బండికాడి, దాని రంధ్రమునందుంచిన బంగారము, దానిగుండా ప్రసరించే మంత్రపూతములగు నీ జలములు నీకు సమస్తసుఖముల నిచ్చుగాక ! భర్తనగు నాతో కూడి సుఖజీవనమును గడుపుము" అని వరుడు పఠిస్తాడు

తరువాత వరుడు ఒక మంత్రాన్ని పఠిస్తూ వధువుపై నూతనవస్త్రాన్ని కప్పుతాడు

"పరిత్వా గిర్వణో గిర ఇమా భవన్తు విశ్వతః ।
వృద్ధోయుమను వృద్ధయో జుష్టా భవంతు జుష్టయః ॥

స్తుతివాక్యముల కర్హుడవగు ఓ పరమేశ్వరా ! మేము చేయు ప్రశంస లన్నియు నీకు చెందినవే అగుగాక ! ఈశ్వరుని గుణములను కీర్తించువారే విద్యా ధికులై లోకంలో సమ్మాన్యులవుతారు."

8)

అనగా గృహస్థాశ్రమ ధర్మములలో ఒకటైన ఈశ్వరారాధనను మనమిద్ద రము యథోక్తముగ నిర్వహించగలమని వరుని యాశయము

## యోక్త్రిబంధనము

వరుడు వధువు నడుము చుట్టూ ఒక దర్భత్రాటిని గట్టి ఈ క్రింది మంత్రాన్ని పఠిస్తాడు

ఆశాసానా సౌమనసం ప్రజాగ్ం సౌభాగ్యం తనూమ్ ।
అగ్నేరనువ్రతా భూత్వా సన్నహ్యే సుకృతాయ కమ్ ॥"

"ఈమెతో కలిసి పుణ్యకర్మానుష్ఠానము చేయుటకొరకై నేనీ త్రాటితో ఈమెను బంధించుచున్నాను ఈమె మంచి మనసు గలదై, ఆరోగ్యవంతురాలై, చక్కని సంతానమును పొంది, పరమేశ్వరుని ఆరాధించుగాక ; ''

వివాహము శాశ్వతబంధమని, అది ధర్మానుష్ఠానముకొరకు ఉద్దేశింపబడిన దని ఒక సందేశాన్ని ఈ యోక్త్రిబంధనసంస్కారం అందిస్తోంది

## మంగళసూత్ర ధారణము

వేదకాలంలో స్త్రీలు కూడ యజ్ఞోపవీతం ధరించి, సంధ్యావందనాదికము నాచరించే వారు వేదాధ్యయనం కూడా చేసేవారు ఈ సంగతి మనకి క్రింది యమస్మృతివచనం వలన తెలుస్తోంది

"పురా కల్పే తు నారీణాం మౌంజీబంధనమిష్యతే ।
అధ్యాపనం చ వేదానాం సావిత్రీవచనం తథా ॥"

అయితే కాలక్రమంలో ఆచారాలు మారేయి స్త్రీలకు యజ్ఞోపవీతం స్థానంలో మాంగల్యతంతువు ఆధారమైంది యజ్ఞోపవీతధారియగు పురుష దేవిధంగా గాయత్రీఉపాసనకు అర్హుడవుతాడో అదే విధంగా మాంగల్యాన్ని ధరించిన స్త్రీ గౌరీఉపాసనకు, ఇతరవ్రతాల్ని అనుష్ఠించేందుకు అర్హతను పొందు తుంది. ఈ సూత్రం యోక్త్రిం వలె భార్యాభర్తల శాశ్వతానుబంధానికి నిదర్శనం కూడా

వివాహము స్త్రీకి ఎంతయో పురుషునికి అంతేగదా ! మరి స్త్రీ మాత్రమే తంతువునేల ధరింపవలె యని ప్రశ్నింప బనిలేదు వివాహకాలమునుండి పురుషుడు కూడ బ్రహ్మచర్యములో ధరించిన యజ్ఞోపవీతము కంటె అధికముగా మరియొక ఉపవీతమును ధరించును ఉపవస్త్రం స్థానంలో మరియొకటి వెరశి మూడు ఉపవీతాల్ని పురుషుడు ధరిస్తాడు

వరుడు మంగళసూత్రాన్ని వధువుకంఠంలో అలంకరింపజేస్తూ మూడు ముళ్లు వేస్తాడు మంగళసూత్రం హారమువలె నిలబడాలంటే రెండు ముళ్ళు ఎల్లాగూ తప్పనిసరి కాని "త్రిషత్యా హి దేవాః'' అనే న్యాయాన్ననుసరించి మూడుముళ్లు వేసే ఆచారం వచ్చి ఉండవచ్చును ఈ సమయంలో వరుడు లోక ప్రసిద్ధమైన ఈ క్రింది శ్లోకాన్ని పఠిస్తాడు

''మాంగల్యతంతునానేన మమ జీవనహేతునా ।
కంఠే బధ్నామి సుభగే సంజీవ శరదాం శతమ్ ॥"

''ఓ సుందరీ ! ఈ మంగళసూత్రాన్ని నీ మెడలో కడుతున్నాను నా జీవనము దీనిపైననే ఆధారపడి ఉంది నీవు శతాయుర్దాయమును పొందుము ''

ఈ మంగళసూత్రం విశిష్టతను చాటే గాథ ఒకటి ఉంది దేవతలు సముద్రాన్ని మథించగా, హాలాహలం పుట్టింది లోకసంరక్షణార్థమై దానిని మింగమని దేవతలు శివుని వేడుకుంటారు శివుడు గౌరీదేవికేసి చూసేడు అపుడామె మనస్థితిని బమ్మెరపోతనామాత్యుడు మధురంగా వర్ణించేరు

"మ్రింగెడివాడు విభుండని
మ్రింగెడిది గరళమనియును మేలని ప్రజకున్,
మ్రింగుమనె సర్వమంగళ
మంగళసూత్రంబు నెంతమది నమ్మినదో

ఆ హాలాహలం శివుణ్ణి ఏమీ చేయలేకపోయింది పైగా, శివునికి కంఠంలో అలంకారమే అయింది శివుడు నీలగ్రీవుడైనాడు అల్లాగే ఈ వధువుయొక్క సౌభాగ్యంచేత, మంగళసూత్రమాహాత్మ్యం చేత వరుడు జీవన సంగ్రామంలో

విజయి అవుతాడు కష్టాలను అధిగమిస్తాడు 'మమ జీవనహేతునా' అనే మాటకు తాత్పర్యం ఇదియే

లలితాసహస్రనామాల్లో ఒక నామం 'కామేశబద్ధమాంగల్య సూత్రశోభిత కంధరా' యని పరమేశ్వరునిచే కట్టబడిన మంగళసూత్రముతో ఆమె కంఠము ప్రకాశించుచున్నది యని యర్థము భాస్కరరాయులు మంగళసూత్రాన్ని "సౌభాగ్యాభరణం" అని వర్ణించేరు అనగా, ఇది ఇతరములగు ఆభరణముల వలె సౌందర్యమును ఇనుమడింప జేయుటయే గాక, వధువుయొక్క సౌభాగ్యము నకు కూడ హేతువగును అని భావము మంగళసూత్రమునకు గౌరీదేవియే అధిష్ఠానదేవత యనియు గ్రహింపనగును

## అక్షతారోపణము

ఇది ఒక మంగళాచారము వధూవరుల భావి జీవితం మంగళమయమగుట కొరకై మంగళద్రవ్యములతో ఆచరించే ఒక పవిత్రకర్మ తండులాలు, ఘృతము, క్షీరము అనే మంగళద్రవ్యాలు దీనిలో ఉపయోగింపబడతాయి తండులాలకే అక్షతలని పేరు అనగా క్షతిలేని సంతతశుభాల్ని కలిగించేవి అని అర్థం ఈ తలంబ్రాలు బంధువులకు పెద్ద వినోదం కూడా

వరుడు వధువుయొక్క అంజలిలో కొద్దిగా క్షీరాన్ని రెండు సార్లు ఉంచి, తరువాత రెండు సార్లు తండులాలను పోసి, మరల క్షీరంతో రెండు సార్లు అభిఘారం చేస్తాడు వరుని అంజలిలో కూడా అదే విధంగా కన్యాదాత (లేదా పురోహితుడు) చేస్తాడు కన్యాదాత వారి అంజలులలో సువర్ణాన్నుంచి, వరుని అంజలిని వధువు అంజలి పై ఉంచి, ఈ క్రింది మంత్రాలతో ఉదకాన్ని పోస్తాడు

పుణ్యం వర్ధతామ్ । (పుణ్యము వర్ధిల్లుగాక)
శాన్తిరస్తు (శాంతి కలుగుగాక)

పుష్టిరస్తు, తుష్టిరస్తు వృద్ధిరస్తు, అవిఘ్నమస్తు, ఆయుష్యమస్తు, ఆరోగ్యమస్తు, స్వస్తి శివం కర్మాస్తు, కర్మసమృద్ధిరస్తు, తిథికరణ ముహూర్తనక్షత్రసంపదస్తు" ఇత్యాది

ఆపై మంత్రపూర్వకంగా వరుడు వధువు శిరస్సుపై అక్షతలను పోస్తాడు ఆ మంత్రాలలో కొన్ని —

"మనసశ్చిత్తమాకూతిమ్ । వాచస్సత్యమశీమహీ ।
పశూనాగ్ం రూపమన్నస్య యశశ్శ్రీశ్శ్రయతాం మయి॥"

"మేము మనస్సుతో విజ్ఞానాన్ని, వాక్కుతో సత్యాన్ని పొందెదము గాక ; పశుసంపదను, అన్నసమృద్ధిని, తద్వారా అనగా దానధర్మముల ద్వారా కీర్తిని పొందెదము గాక: నాయందు ధనసమృద్ధి ఎల్లప్పుడు నుండుగాక !"

"దదామీత్యగ్నిర్వదతి। తథేతి వాయురాహ తత్ ।
హంతేతి సత్యం చంద్రమాః । ఆదిత్యస్సత్యమోమితి ॥

'ఈ కన్యను దానము చేయుచున్నాన'ని వలుకువాడు అగ్ని. 'తథాస్తు' అన్నవాడు వాయువు 'ఈ జంట చాలా బాగుంది, నిజం' అంటున్నాడు చంద్రుడు. ఆదిత్యుడు "నిజమే సుమా" అని తల వంకిస్తున్నాడు.

**Marriages are made in heaven** అనే సామెత ఉన్నది ; ఈ మంత్రాల లోని భావాలముందు ఈ సామెత ఎంతటి అల్పమైనదో అనిపిస్తుంది.

"ప్రజా మే కామస్సమృధ్యతామ్" (నా సంతానేచ్ఛ సమృద్ధమగు గాక) అంటూ వరుడు వధువు శిరస్సుపై తలంబ్రాలు పోస్తాడు వెంటనే వధువు వరుని శిరస్సుపై పోస్తుంది

మరల ఇద్దరి అంజలులు పూర్వంలాగే తండులాలతో నింపబడతాయి "పశవో మే కామస్సమృధ్యతామ్" (నాకు పశుసంపద సమృద్ధమగుగాక) అంటూ వధువు ముందు, తరువాత వరుడు తలంబ్రాలు పోసుకుంటారు. మూడవసారి "యజ్ఞో మే కామస్సమృధ్యతామ్ (నా యొక్క యజ్ఞానుష్ఠానం చేయాలనే కోరిక తీరుగాక!)" అంటూ వరుడు, తర్వాత వధువు తలంబ్రాలు పోసుకుంటారు తదు పరి "శ్రియో మే కామస్సమృధ్యతామ్" (నాకు లక్ష్మీ అనుగ్రహం కలుగుగాక!) అంటూ వధూవరులు ఒకేసారి అన్యోన్యం తలంబ్రాలు పోసుకుంటారు. ఆ తరు వాత అంతా వినోదమే మంత్రాలేమీ లేవు పరస్పరం తలంబ్రాలు పోసుకుం టూం టే బంధుగణం ఆనందిస్తుంది

## మహదాశీర్వచనము

రాగద్వేషములు, సత్యానృతములతో కూడిన లౌకికజీవనం గడిపే వారికీ, రాగద్వేషాతీతమైన సత్యజీవనం గడిపేవారికి ఒక తేడా ఉంది లౌకికులు ఒక సంఘటన జరిగేక దానిపై వ్యాఖ్యానిస్తారు కాని మహర్షులు ఒక మాటను ఉచ్చరిస్తే, దానిని బట్టి సంఘటనలు జరుగుతాయి ఈ భావాన్ని భవభూతి ఉత్తరరామ చరితములో ఇల్లా ప్రస్తావించేడు

"లౌకికానాం హి సాధూనామర్థం వాగనువర్తతే ।
ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోనుధావతి ॥"

ఇంతేగాక, మనుష్యుల ఆశీస్సులు ఫలించకపోవచ్చు కాని, దేవతల ఆశీస్సులు తప్పక ఫలిస్తాయి కాని మనకు దేవతలెక్కడనుంచి వస్తారు? వేదాధ్యయనం చేసిన పుణ్యాత్ములయందు సమస్తదేవతలు సన్నిహితులై ఉంటారని శాస్త్రం బోధిస్తోంది

సర్వా దేవతా వేదవిది బ్రాహ్మణే వసంతి తస్మాద్బ్రాహ్మణేభ్యో వేదవిద్భ్యో దివే దివే నమస్కుర్యాన్నాశ్లీలం కర్తయేత్"

కనుక, ఋషితుల్యులగు వేదవేత్తలు ఆశీర్వదిస్తే, వారి ఆశీస్సులు తప్పక ఫలిస్తాయి వారి పవిత్రమైన వాక్కులో సమస్తశుభాల్ని కలిగించే శక్తి ఉన్నదని వేదం బోధిస్తోంది

"భద్రైషాం లక్ష్మీర్నిహితాధి వాచి"

ఈకారణంగా, వేదవేత్తలు వచ్చి వధూవరులను ఆశీర్వదించి సత్కారములను పొందుట అనే ఆచారం చిరకాలంగా మనకు వస్తోంది ఒకప్పుడు ఆహ్వానం లేకపోయినా వేదవేత్తలు వచ్చి ఆశీర్వదించటం మన అదృష్టంగా భావించాలి వేదవేత్తలు వివాహశుభసమయంలో పఠించే కొన్ని ఆశీర్వచనమంత్రాలు ఇచట వివరింపబడ్డాయి

"యో వై తాం బ్రహ్మణో వేద । అమృతేనావృతాం పురీమ్ ।
తస్మై బ్రహ్మ చ బ్రహ్మా చ । ఆయుః కీర్తిం ప్రజాం దదుః ॥"

''ఈ దేహమే ఒక దేవాలయము సమస్తదేవతలు దాని యందు నివసిస్తారు హృదయాకాశంలో ఆనందస్వరూపుడగు పరమాత్మ నిండి ఉన్నాడు ఈ దేహమనే పురంలో సాక్షిరూపుడగు పరమాత్మను ఎవరు ఉపాసిస్తాడో, వానికి ఆ పరమాత్మ ప్రజాపతి మొదలగు దేవతలు ఆయుర్దాయాన్ని, కీర్తిని, సత్సంతానాన్ని ప్రసాదిస్తారు '' అని ఈ మంత్రతాత్పర్యము ఈ దంపతులు తమ జీవితంలో అర్థకామాలను సేవిస్తూనే, పరమాత్మను దర్శించే ప్రయత్నాన్ని మరువరాదని ఈ ఆశీస్సు సూచిస్తోంది

"నవో నవో భవతి జాయమానోఽహ్నాం కేతురుషసామేత్యగ్రే।
భాగం దేవేభ్యో విదధాత్యాయన్ప్ర చంద్రమాస్తిరతి దీర్ఘమాయుః॥"

"సూర్యచంద్రులు నిత్యనూతనులు ఉషఃకాలంలో తూర్పున ఉదయించే సూర్యుడు ఒక కొత్త రోజు ప్రారంభం అవుతోందని సూచించే పతాకలా ఉన్నాడు ఆయన ఉదయించగానే ఆహితాగ్నులు దేవతలకు హవిస్సుల నర్పిస్తున్నారు. అట్టి సూర్యుడు, చంద్రుడు ఈ పవిత్రవివాహసంస్కారానికి సాక్షులు వారీ వధూవరులకు దీర్ఘాయుర్దాయాన్ని ప్రసాదించెదరుగాక।''

"ఆయుర్దా అగ్నే హవిషో జుషాణో ఘృతప్రతీకో ఘృతయోనిరేధి । ఘృతం పీత్వా మధు చారు గవ్యం పితేవ పుత్రమభిరక్షతాదిమమ్ ॥"

''హే అగ్నే ! హోమములో సమర్పింపబడిన గోఘృతము నీకెంతయూ ప్రీతికరమైనది నిన్ను ఆ ఘృతము జ్వాలలతో వృద్ధి పొందించును నీవీ హవిస్సును గ్రహించి, తండ్రి పిల్లవానిని వలె, ఈ యజమానిని సంపూర్ణముగా రక్షించుము ఆయువు నొసంగుము '' ఇత్యాదిగా అనేక మంత్రములతో, వేదవేత్తలు వధూవరుల నాశీర్వదిస్తారు దేవతలు తథాస్తు వలుకుతారు

## ప్రధానహోమము

వధూవరుల వస్త్రాల కొంగులను కలిపి, సువర్ణఫలసహితముగా, అగ్నిని స్తుతించే మంత్రం పఠిస్తూ ముడివేస్తారు. దీనికి 'బ్రహ్మగ్రంథి' అని పేరు అపుడు

వరుడు హోమములు నిర్వర్తించుటకొరకై, వధువును కుడిచేత్తో పట్టుకొని, అగ్ని హోత్రగృహానికి తీసుకువెళ్తూ ఒక మంత్రాన్ని పఠిస్తాడు

"పూషా త్వేతో నయతు హస్త గృహ్యాశ్వినౌ త్వా ప్రవహతాగ్ం రథేన । గృహాన్గచ్ఛ గృహపత్ని యథాసో వశినీ త్వం విదథమావదాసి ॥"

హేవధూ ! నిన్ను సూర్యభగవానుడే చేయి పట్టుకొని ఇక్కడనుండి అగ్నిహోత్రగృహానికి తీసుకువెళ్లగాక! అశ్వినీదేవతలు నిన్ను రథముపై అధిరోహింపజేసి, నా గృహమునకు తీసుకుని వెళ్లెదరు గాక! నీవు నా గృహమునకు యజమానురాలవై గృహమందలి ఇతరజనులను వశము చేసుకుని, గృహకార్యములను నిర్వర్తింపుము ''

హిందూ వివాహానికి సాక్షి అగ్నిహోత్రుడే కనుక, సుముహూర్తం అయిన తరువాత వధూవరులు కలిసి, తమ వివాహానికి సాక్షియగు అగ్నిలో కొన్ని హోమాలు చేస్తారు అపుడు మాత్రమే వారి వివాహం సిద్ధిస్తుంది ఏలయన అగ్ని **Marriage Registrar** వంటివాడు కనుక ఈ హోమం వివాహంలో అతిముఖ్యమైనది కనుకనే దీనికి "ప్రధానహోమము'' అని సార్థకనామధేయము వధువు ఇపుడు పత్నియగును "పత్యుర్నో యజ్ఞసంయోగే'' అనే పాణిని సూత్రం ప్రకారం, యజ్ఞమునందు సహాధికారము కలిగి, యజ్ఞఫలమునకు భోక్త్రియగు వధువు పత్ని యనబడును

## పాణిగ్రహణము

వరుడు తన కుడిచేతితో వధువు కుడిచేతిని సమంత్రకంగా పట్టుకోవడమే పాణిగ్రహణం ఇదియే సుముహూర్తకర్తవ్యమనే విషయం ఇతఃపూర్వమే ప్రస్తావించబడింది ఇకపై నేను నీ రక్షణభారాన్ని వహిస్తానని సూచించడానికి వరుడు వధువు చేయిపట్టుకుంటాడు ఈ క్రింది మంత్రాల్ని వరుడు పఠిస్తాడు

"గృభ్ణామి తే సుప్రజాస్త్వాయ హస్తం మయా పత్యా జరదష్టిర్యథా సః । భగో అర్యమా సవితా పురంధిర్మహ్యం త్వాదుర్గార్హపత్యాయ దేవాః ॥"

"నీవు, నేను కలిసి ముసలితనం వచ్చేదాకా కలిసి జీవించటానికి, యోగ్యమైన సంతానాన్ని పొందటానికి నీ చేతిని పట్టుకొంటున్నాను జ్ఞానస్వరూపులగు సవిత మొదలగు దేవతలు నిన్ను నాకు గృహస్థాశ్రమధర్మాన్ని నిర్వర్తించుట కొరకై ఇచ్చినారు ''

ఈ మంత్రంలో వివాహం జీవితాంతం ఉండే పవిత్రబంధమని స్పష్టమవుతోంది అంతేగాక, వధువు దేవతలచే తనకు ఈయబడిన ఒక వరంగా వరుడు భావించడం ఈ మంత్రంలో విశేషము

"సరస్వతి ప్రేదమవ సుభగే వాజినీవతి ।
తాం త్వా విశ్వస్య భూతస్య ప్రగాయామస్యగ్రతః ॥"

''గొప్ప స్తోత్రములచే ప్రార్థింపబడే ఓ సరస్వతీ ! ఈ మా వివాహబంధాన్ని నీవు పరిరక్షింపుము సమస్తభూతములలో నిన్ను నేను ముందుగా స్తోత్రము చేయుచున్నాను ''

ఇట్టి మంత్రాల్ని పఠించి వరుడు వధువుయొక్క హస్తాన్ని గ్రహిస్తాడు శ్రీమద్రామాయణంలోని బాలకాండలో సీతాకల్యాణఘట్టంలో పాణిగ్రహణాన్ని చేయించే జనకమహారాజు వాక్యము లోకప్రసిద్ధి పొందినది

"ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ ।
ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా ॥"

''హేరామా ! ఈమె నా కుమార్తె సీత ఈ క్షణమునుండి నీ సహధర్మచారిణి ఈమెను స్వీకరింపుము నీకు మంగళమగుగాక ఆమె చేతిని నీ చేతితో పట్టుకొనుము ''

## సప్తపది

వధూవరులు అగ్నిహోత్రసమక్షంలో సమంత్రకంగా ఏడడుగులు కలిసి నడుస్తారు దానివలన ఏర్పడే 'సాప్తపదీనసఖ్యము' జీవితాంతం వెల్లివిరుస్తుంది. అపుడు వరుడు పఠించే మంత్రాలు ఇవి-

"ఏకమిషే విష్ణుస్త్వాన్వేతు । ద్వే ఊర్జే విష్ణుస్త్వాన్వేతు । త్రీణి

వ్రతాయ విష్ణుస్త్వాన్వేతు । చత్వారి మాయో భవాయ విష్ణుస్త్వాన్వేతు । పంచ పశుభ్యో విష్ణుస్త్వాన్వేతు షడృతుభ్యో విష్ణుస్త్వాన్వేతు । సప్త సప్తభ్యో హోత్రాభ్యో విష్ణుస్త్వాన్వేతు ।"

"ఓసీ చిన్నదానా నీవు నా వెనుక నడువుము విష్ణుభగవానుడు నీ మొదటి యడుగువలన అన్నసమృద్ధిని, రెండవ యడుగువలన బలమును, మూడవ యడుగు వలన కర్మానుష్ఠానమును, నాల్గవ యడుగువలన కర్మఫలరూపమగు సుఖమును, అయిదవ యడుగువలన పశుసంపదను, ఆరవ యడుగువలన ఋతుసంపదను, ఏడవ యడుగువలన యజ్ఞానుష్ఠానమున కవసరమగు ఏడ్గురు ఋత్విక్కులను అనుగ్రహించుగాక ।"

ఏడవ అడుగులో వరుడు ఈ క్రింది మంత్రాన్ని పఠిస్తాడు

"సఖా సప్తపదా భవ సఖాయౌ సప్తపదా బభూవ సఖ్యం తే గమేయగ్ం సఖ్యాత్తే మా యోషగ్ం సఖ్యాన్మే మా యోష్ఠాస్సమయావ సంకల్పావహై సంప్రియౌ రోచిష్ణూ సుమనస్యమానౌ ఇషమూర్జమభి సంవసానౌ సం నౌ మనాగ్ంసి సంవ్రతా సము చిత్తాన్యాకరమ్ । సా త్వమస్యమూహ మమూహమస్మి సా త్వం ద్యౌరహం పృథివి త్వగ్ం రేతోఽహగ్ం రేతోభృత్త్వం మనోహమస్మి వాక్త్వగ్ం సామాహమ స్మ్యృక్త్వగ్ం సామామనువ్రతా భవ పుగ్ంసే పుత్రాయ వేత్తవై శ్రియై పుత్రాయ వేత్తవ ఏహి సూనృతే ॥"

"ఏడడుగులు కలిసి నడిచిన మనమిద్దరము స్నేహితులమైతిమి నేను నీ స్నేహము నెప్పటికి విడువను నీవు కూడా నాతో స్నేహము నెన్నటికి విడువకుము మనము అన్యోన్యానురాగముకల్గి, అనుకూల దాంపత్యముతో ప్రకాశిద్దాము మంచి మనసుతో జీవిద్దాము అన్నమును, బలమును కలిసి అనుభవిద్దాము పరస్పరం చర్చించుకొని కార్యాల్ని నిర్వహిద్దాము మన మనస్సులు ఎల్లపుడు కలిసి ఉండాలి మనము కలిసి ధర్మాన్ని అనుష్ఠిద్దాము నీవు ఋక్కువైతే, నేను సామను. నేను ఆకాశమైతే, నీవు భూమివి నేను మనస్సునైతే, నీవు వాక్కువు

నీవు సత్యమునే పలుకుదానవు అనుకూలమైన వ్రతము గలదానవు నీవలన నేను యోగ్యమగు సంతానాన్ని, సంపదలను కూడ పొందగలను నావద్దకు రమ్ము "

ఈ మంత్రంలో వధూవరులను రూపకం చేసిన ద్వంద్వాలు సాభిప్రాయంగా ఉన్నాయి సామకు ఋక్కు అధిష్ఠానం 'ఋచ్యధ్యూఢగ్ం సామ' అని ఛాందోగ్యము అయితే, ఋక్కుయొక్క సారమే సామ ''ఋచస్సామ రసః'' అని ఛాందోగ్యశ్రుతి ఈ విధంగా ఋక్సామలు రెండు పరస్పరపూరకాలు ద్యావా పృథివులు, వాఙ్మనస్సులు కూడా ఇల్లాంటి ద్వంద్వాలే వధూవరులు కూడా ఇదే విధంగా పరస్పరపూరకాలుగా ఉండాలని 'సప్తపది' బోధిస్తోంది

భవభూతి సీతారాముల దాంపత్యాన్ని ఇల్లా వర్ణించేడు-

"అద్వైతం సుఖదుఃఖయోరనుగతం సర్వాస్వవస్థాసు యత్
విశ్రామో హృదయస్య యత్ర జరసా యస్మిన్నహార్యో రసః ।
కాలేనావరణాత్యయాత్పరిణతే యత్ప్రేమసారే స్థితం
భద్రం తస్య సుమానుషస్య కథమప్యేకం హి తత్ప్రార్థ్యతే ॥"

దంపతులు సుఖదుఃఖాలను కలిసి పంచుకుంటారు అన్ని అవస్థలలోను ఏకరూపంగా ఉంటారు అలసి సొలసిన హృదయాలకు పరస్పరం విశ్రాంతి స్థానంగా ఉంటారు వయసు పైబడ్డా వారి మధ్య ప్రేమ మాత్రం తగ్గేది కాదు మరణించే వరకు ఈ ప్రేమ పెరుగుతూనే ఉంటుంది ఇట్టి పవిత్రదాంపత్యం క్షేమంగా ఉండాలి ఇంతకంటె కోరేదేమీలేదు ''

భవభూతి చేసిన ఈ వర్ణన సప్తపది మంత్రాలకు అర్థం పడుతోంది సప్తపది అయిన తరువాతనే యథార్థమైన దాంపత్యం నిశ్చితమైనదని, వరుడు పతిగాను, వధువు పత్నిగాను అయ్యేది సప్తపదితోనే యని యాజ్ఞవల్క్యస్మృతి చెపుతోంది దీనినిబట్టి 'సప్తపది' అతిముఖ్యసంస్కారమని స్పష్టమవుతోంది పైగా, 'సప్తపది' వలననే గోత్రపరివృత్తి జరుగుతుంది అనగా, వధువు గోత్రం వరుని గోత్రంగా మారుతుంది

వధూవరులు సప్తపది' అయిన తర్వాత కొన్ని హోమాలు చేస్తారు ఈ హోమమంత్రాలు ముఖ్యంగా వధువు తండ్రియింటిని వీడి వరునిగృహానికి వెళ్లటాన్ని ప్రస్తావిస్తాయి

"కన్యలా పితృభ్యో యతీ పతిలోకమవదీక్షామదాస్థ స్వాహా"

"ఈ కన్య పితృగృహాన్ని వీడి, భర్తృగృహానికి వెళ్ళబోతూంది ఈమె కన్యకావ్రతం పరిసమాప్తం అయింది ''

"ప్రేతో ముంచాతి నాముతస్సుబద్ధామముతస్కరత్ । యథే-యమింద్ర మీఢ్వస్సుపుత్రా సుభగా సతి స్వాహా ॥"

""హేఇంద్రాః నీవు వర్షాల్ని కురిపించి సస్యాల్ని వృద్ధి చేస్తావు ఈ కన్యక పితృగృహాన్ని విడిచిపెట్టి, భర్తృగృహానికి వెళ్లనున్నది ఈమె అచట శాశ్వత స్థానాన్ని పొందునట్లు అనుగ్రహింపుము ఈమె సత్సంతానము కలదిగా, సౌభాగ్య వంతురాలిగా, భర్త అనురాగమును బడయునదిగా నీవు అనుగ్రహింపుము ''

"అగ్నిరైతు ప్రథమో దేవతానాగ్ం సోఽస్యై ప్రజాం ముంచతు మృత్యుపాశాత్ । తదయగ్ం రాజా వరుణోఽనుమన్యతాం యథేయగ్గ్ స్త్రీ పౌత్రమఘం నరోఽదాత్ స్వాహా ॥"

దేవతలలో ప్రథముడైన అగ్ని, వరుణదేవుడు తమ అనుగ్రహముచే ఈమె సంతానమును దీర్ఘాయుర్దాయము కలవారినిగా చేసి, ఈమెకు పుత్రదుఃఖము లేకుం డగ అనుగ్రహించెదరు గాకః''

"మా తే గృహే నిశిఘోష ఉత్థాదన్యత్ర త్వద్రుదత్యస్సం విశంతు మా త్వం వికేశ్యుర ఆవధిష్ఠా జీవపత్నీ పతిలోకే విరాజ పశ్యంతీ ప్రజాగ్ం సుమనస్య మానాగ్ స్వాహా ॥"

ఓకన్యకాః నీ గృహములో రాత్రియందైనను ఎన్నడును రోదనధ్వని విన బడకుండుగాకః జుట్టు విరబోసుకుని గుండెలు బాదుకొనుచూ ఏడ్చే అవస్థ నీకు కలగకుండుగాకః నీవు ఎల్లప్పుడును సుమంగళివై యుండుము నీ సంతానము సర్వదా క్షేమముగ నుండుదుగాక ః అట్టి గృహములో నీవు ప్రకాశించుము " ఇట్టి మంగళాశాసనములతో కూడిన అనేక మంత్రములతో హోమాలను నిర్వర్తిస్తారు.

## అశ్మారోహణము

వరుడు అగ్నికి ఉత్తరముగా పాషాణము (సన్నికల్లు)పై వధువు తన కుడికాలు నుంచునట్లు చేసి, ఈ క్రింది మంత్రాన్ని పఠిస్తాడు

''ఆతిష్ఠేమమశ్మానమశ్మేన త్వగ్గ్ స్థిరా భవ ।
అభితిష్ఠ పృతన్యతస్సహస్వ పృతనాయతః ॥"

''హేవధూ : ఈ రాతిని అధిష్ఠించుము నీవు దీనివలె స్థిరముగా నుందువు గాక ! నీపై కలహమునకు వచ్చువారిని ఎదుర్కొనుము వారి కలహమును సహించి యుద్ధము చేయుము ''

ఈ ఆశ్మారోహణము భార్యాభర్తలమధ్య బంధము శిలాశాసనము వంటిదని సూచించును మరియు, అత్తవారింట్లో ఈమె స్థానము తక్కువ కాదనియు, గృహిణిగా ఆమెకు అన్ని హక్కులు కలవనియు ఈ మంత్రమును బట్టి అవగత మగుచున్నది

## లాజహోమము

వధువుయొక్క సోదరుడు పేలాలను ఆమె అంజలిలో పోసిన తరువాత, వాటిని ఘృతముతో అభిఘరించి, మంత్రపూర్వకంగా వరుడు వామపార్శ్వ హోమం చేయిస్తాడు

"ఇయం నార్యుపబ్రూతే కుల్పాన్యావపన్తికా ।
దీర్ఘాయురస్తు మే పతిర్జీవాతు శరదశ్శతగ్గ్ స్వాహా ॥"

''ఈ వధువు లాజలను హోమము చేయుచూ, నా భర్త శతాయుర్దాయము కలవాడు కావలెనని పలుకుచున్నది ''

తరువాత వధూవరులు అగ్నిచుట్టూ ప్రదక్షిణం చేస్తారు అపుడు వరుడు పఠించే మంత్రాలలో ఒకటి

"పునః పత్నీమగ్నిరదాదాయుషా సహ వర్చసా,
దీర్ఘాయురస్యాయః పతిస్స ఏతు శరదశ్శతమ్ ॥

"అగ్ని హోత్రుడు ఈ వధువును దీర్ఘాయుర్దాయము కలదిగను, తేజస్విని గను చేసి నాకు సమర్పించెను ఈమె పెనిమిటినగు నేను కూడ శతాయుర్దాయము గలవాడ నగుదును గాక ! "

ప్రదక్షిణాలు అయ్యేక, తిరిగి అశ్మారోహణము, మరల లాజహోమము చేస్తారు అప్పటి మంత్రం ఇది

"అర్యమణం ను దేవం కన్యా అగ్నిమయక్షత స ఇమాందేవో అధ్వరః ప్రేతో ముంచాతి నాముతస్సుబద్ధామముతస్కరత్ స్వాహా''

''పూర్వము స్త్రీలు అగ్నిహోత్రుని పూజించిరి అగ్నిహోత్రుని యను గ్రహముచే ఈమె పితృగృహమును వీడి, భర్తృ గృహమునందు స్థిరముగా నుండుగాక ! ఈమెకు భర్త అనురాగము సంపూర్ణముగా లభించుగాక ! ''

మరల అగ్నికి ప్రదక్షిణము, అశ్మారోహణము, తిరిగి లాజహోమము చేస్తారు

## యోక్త్రి విమోచనము

వధువు నడుము చుట్టూ కట్టిన యోక్త్రిన్ని వరుడు సమంత్రకంగా విప్పుతాడు

"ప్ర త్వా ముంచామి వరుణస్య పాశాద్యేన త్వా బధ్నాత్సవితా సుకేతః । ధాతుశ్చ యోనౌ సుకృతస్య లోకే స్యోనం తే సహ పత్యా కరోమి ॥ ''

హేవధూ ! సమస్తప్రాణులను పోషించే, మంచి హృదయము గల వరుణ దేవుడు నిన్ను యే పాశముతో బంధించెనో, దానినుండి నీకు విముక్తి కలిగించు చున్నాను మహాపుణ్యముచే పొందదగిన సత్యలోకమునందు నీవు నాతోకూడి సుఖకరమగు స్థానమును పొందగలవు

పాశ్చాత్యదేశాల్లో వివాహము అనేది దంపతుల అదృష్టాన్ని బట్టి కొన్ని మాసాలనుండి కొన్ని సంవత్సరాలవరకు అమలులో ఉండే ఒక కాంట్రాక్టుగా పరిగణింపబడుతుంది కానీ హిందూ సమాజవ్యవస్థలో వివాహం ఆజీవనాంత

బంధము మాత్రమే గాక, పరలోకంలో కూడా ఈ దంపతులు కలిసి సుఖంగా ఉండాలని వివాహమంత్రాలు ఆకాంక్షిస్తున్నాయి

## వధువు వరుని గృహమునకు వెళ్ళుట

పూర్వకాలంలో వరుడు వధువును రథముపై నెక్కించి స్వగృహానికి తీసుకు వెళ్లెడివాడు తరువాతి కాలంలో రథము స్థానంలో పల్లకి, ఎడ్లబండి వాడుకలోకి వచ్చేయి ప్రస్తుతము మోటారువాహనమునే సర్వత్ర వినియోగిస్తున్నారు ఈ మార్పు సహజమైనదే కాని ఆసమయంలో వరుడు పఠించే మంత్రముల వైశిష్ట్యము ఈనాటికీ ఏమీ తగ్గలేదు అంతేగాక, కట్నముల కొరకై వేధింపులు ఇత్యాది అమంగళచర్యలు పూర్తిగా తొలగిపోని మన హిందూ సమాజంలో ఈ మంత్రముల వైశిష్ట్యం బహుజనాదరణ పొందవలసిన అవసరముందని తోచును

"సుకిగ్ంశుకగ్ం శల్మలిం విశ్వరూపగ్ం హిరణ్యవర్ణగ్ం సువృత్తగ్ం సుచక్రమ్ । ఆరోహ వధ్వమృతస్య లోకగ్గ్ స్యోనం పత్యే వహతుం కృణుష్వ ॥"

"హేవధూ ! ఈ రథము శాల్మలీవృక్ష దారువుతో అందంగా నిర్మింపబడినది దీనిని నీవు అధిరోహింపుము నీవు నా గృహానికి వచ్చి, నన్ను సుఖపెట్టుము "

"ఉదుత్తరమారోహంతీ వ్యస్యంతీ పృతన్యతః ।
మూర్ధానం పత్యురారోహ ప్రజయా చ విరాడ్భవ ॥"

"ఈ యానముపై నీవధిష్ఠించి, నీతో కలహము గోరువారిని పరాభవించుము నా శిరసుపై అధిరోహించుము సంతానముచే ప్రకాశించుము "

"మూర్ధానం పత్యురారోహ" అనగా భర్తనగు నాపై సర్వాధికారములు నీవే" అని తాత్పర్యము ఈ భావమునే తర్వాతి మంత్రము ఇంకనూ విశదపరచుచున్నది

"సమ్రాజ్ఞీ శ్వశురే భవ సమ్రాజ్ఞీ శ్వశ్ర్వాం భవ।
ననాందరి సమ్రాజ్ఞీ భవ సమ్రాజ్ఞీ అధి దేవృషు॥"

''అత్తమామలు, ఆడపడుచులు, మరదులు - వీరందరిపై సమ్రాజ్ఞివి అగుము ''

"స్నుషాణాగ్ం శ్వశురాణాం ప్రజాయాశ్చ ధనస్య చ ।
పతీనాం చ దేవృణాం చ సజాతానాం విరాడ్భవ ॥ "

"అత్తమామలు కోడండ్రు, వారి సంతానము, ధనము, భర్తనగు నేను, మా వంశములోని ఇతరులు - వీరందరిపై నీవు ప్రేమయుక్తమగు ఆధిపత్యమును పొందుము ''

తరువాత, ''మార్గము చోరాదిబాధలు లేక సుఖకరమగుగాక ! " అని ఆశీర్వదించే మంత్రాలు పఠిస్తారు మార్గమధ్యంలో నావను ఎక్కేప్పుడు ఒక మంత్రాన్ని చెప్తారు

"అయం నో మహ్యాః పారగ్ స్వస్తి నేషద్వనస్పతిః ।
సదా నస్సుతరా భవ దీర్ఘాయుత్వాయ వర్చసే ॥ "

''కొయ్యచే చేయబడిన ఈ నావ మమ్ములను నది అవలి తీరమునకు సుఖముగా చేర్చుగాక ! ఓ నావా ! నీవు మమ్ములను దాటించి, మాకు దీర్ఘాయుర్దాయమును, తేజస్సును కలిగింపుము ''

నావ దాటేప్పుడు వధువు కళ్ళు మూసుకుని, నది దాటిన తర్వాత ఒక మంత్రాన్ని పఠించాలి

"అస్య పారే నిరృతస్య జీవా జ్యోతిరశీమహి ।
మహ్యా ఇంద్ర స్వస్తయే ॥ "

''నదిని సుఖముగా దాటి మేము అభయమును పొందితిమి ఆ పరమేశ్వరుడు మాకు అధికమగు శుభమును కలుగజేయుగాక . ''

## వధూ గృహప్రవేశము

వరుడు వధువునకు తన గృహాన్ని చూపిస్తూ, ఈ క్రింది మంత్రాన్ని పఠిస్తాడు

"సంకాశయామి వహతుం బ్రహ్మణా గృహైరఘోరేణ చక్షుషా మైత్రేణ పర్యాణద్ధం విశ్వరూపం యదస్యాగ్ స్యోనం పతిభ్యస్సవితా కృణోతు తత్॥"

''ఈమె తండ్రిచే నీయబడిన ఆభరణాన్ని ధరించి నా గృహానికి వచ్చినది ఈమెకు నా గృహమును చూపుచున్నాను ఈమె ప్రేమానురాగములతో కూడిన చూపులతో నా గృహమును చూచుగాక ! ఈమె నాకును, నా గృహములోని ఇతరకుటుంబసభ్యులకు చేదోడు వాదోడుగా నుండునట్లు పరమేశ్వరుడను గ్రహించు గాక ! ''

ఈ మంత్రంలో వధువునకు ఒక సందేశం గోచరిస్తుంది ఆమె వరుని గృహంలోని వారిని తనవారిగా భావించే దృక్కోణంతో వరుని గృహంలో ప్రవేశించాలి ఇట్టి అనుకూలధోరణి అనేక కుటుంబసమస్యలను నివారించటంలో దోహదం చేస్తుంది

వరుడు మరో మంత్రంలో తాను సుఖంగా ఇంటికి చేరినందులకు అశ్వినీ దేవతలకు కృతజ్ఞతను తెలుపుతాడు వధువు కుడికాలు ముందు పెట్టి ఇంటిలో ప్రవేశిస్తూ ఈ క్రింది మంత్రాన్ని పఠించాలి గడపపై కాలు పెట్టరాదు

"గృహాన్భద్రాన్త్సుమనసః ప్రపద్యేఽవీరఘ్నీ వీరవతస్సువీరాన్ ఇరాం వహతో ఘృతముక్షమాణాస్తేష్వహగ్ం సుమనాస్సంవిశామి ॥ "

''ఈ గృహము మంగళకరమైనది ఇందలి వ్యక్తులు మంచి మనసు గలవారు, సమర్థులు ఇచట అన్నోదకములు సమృద్ధిగా నున్నవి నేనినాడు ఈ గృహమును వాదిగా చేసుకొనుచున్నాను ఈ గృహంలో నేనెవ్వరికీ కష్టాన్ని కలిగించను నేనీ గృహంలో మంచి మనసుతో ప్రవేశిస్తున్నాను

## ప్రవేశహోమము

గృహప్రవేశం అయిన తర్వాత, వధూవరులు యథావిధిగా సంకల్పం చేసి, వైవాహికాగ్నిని ప్రతిష్ఠించి, ప్రవేశహోమాన్ని నిర్వహిస్తారు కొన్ని ప్రవేశహోమ మంత్రాలు ఇచ్చట వివరించబడ్డాయి

"ఆగన్గోష్ఠం మహిషీ గోభిరశ్వైరాయుష్మత్పత్నీ ప్రజయా స్వర్విత్ బహ్వీం ప్రజాం జనయంతీ సురత్నే మమగ్నిగ్‍ం శతహి మాస్సపర్యాత్ స్వాహా ॥ "

"ఈమె నా గృహమును తన తండ్రి ఇచ్చిన స్త్రీధనముతో సహా ప్రవేశించినది ఈమె సౌభాగ్యముచే నేను చిరకాలము జీవిస్తాను ఈమె చక్కని సంతానాన్ని పొందగలదు ఈమె స్వర్గలోకప్రాప్తి సాధనమగు పుణ్యమును బడయగలదు ఈమెవలన ఈ గృహములో సంపదలు విలసిల్లును. ఈమె ఈ గార్హపత్యాగ్నికి నూరు సంవత్సరములు పరిచర్య చేయుగాక ! "

"అయమగ్నిర్గృహపతిస్సునగ్ంసత్పుష్టివర్ధనః యథా భగస్యాభ్యాం దధద్రయిం పుష్టిమథో ప్రజాగ్ స్వాహా ॥ "

మా గృహమునకు ప్రభువు ఈ అగ్నిదేవతయే ఈతడు మాకు పుష్టిని, ధనమును, సత్సంతానమును ఇచ్చుగాక ! "

"ప్రజాయా ఆభ్యాం ప్రజాపత ఇంద్రాగ్నీ శర్మ యచ్ఛతమ్ ।
యథైనయోర్న ప్రమీయాతా ఉభయోర్జీవతోః ప్రజాస్స్వాహా ॥ "

హే ప్రజాపతీ ! హే ఇంద్రా ! హే అగ్నే ! దంపతులమగు మేమిద్దరము జీవించియుండగా మా సంతానము మరణించకుండునట్లు అనుగ్రహించుడు మా సంతానమునకు సుఖమును కలుగజేయుడు "

"ఇహైవ స్తం మా వియోష్టం విశ్వమాయుర్వ్యశ్నుతమ్ ।
మహ్యా ఇంద్ర స్వస్తయే స్వాహా ॥ "

"ఓ దంపతులారా ! మీరీగృహమునందు సుఖముగా కలిసి మెలిసి, వియో

గము నెరుంగనివారై పూర్ణాయుర్దాయము జీవించుడు. పరమేశ్వరుడు మీకు అతిశయించిన మంగళమును కలిగించుగాక !" అని ఈ మంత్రం దంపతుల నాశీర్వదిస్తోంది

"త్వమగ్నే అయాస్యయాసన్మనసా హితః ।
అయాసన్ హవ్యమూహిషేఽయానో దేహి భేషజగ్ గ్ స్వాహా ॥"

"ఓ అగ్నిహోత్రుడా ! నీవు భక్తులచే పొందదగినవాడవు నిన్ను మేము మనసా ధ్యానించుచున్నాము మేము సమర్పించు అజ్యాది హవిస్సులను దేవతల కర్పించు వాడవు నీవే మాకు సమస్తదుఃఖములను పోగొట్టుము"

ప్రవేశహోమానంతరము ఒక పిల్లవానిని వధువు ఒడిలో కూర్చుండబెట్టి, ఆమెచేత ఆ పిల్లవానికి కొన్ని ఫలాల్ని ఇప్పిస్తారు. అపుడు వరుడీ మంత్రాన్ని పఠిస్తాడు

"ఇహ ప్రియం ప్రజయా తే సమృధ్యతామస్మిన్ గృహే గార్హపత్యాయ జాగృహి ఏనాపత్యా తన్వగ్ం సగ్ంసృజ స్వాథాజీవ్రి విదథమావదాసి ॥"

"ఓ చిన్నదానా ! నీవీ గృహమందు నివసించుచూ, సత్సంతానమును పొందుము ఆదర్శగృహిణివై అతిథిపూజ మొదలగు ధర్మాల్ని నిర్వర్తించుము భర్తనగు నాతో కూడి కామసుఖాల్ని అనుభవించుము నీవు పెద్దవయసు వచ్చే వరకు జీవించి, నీ పిల్లలకు మార్గదర్శనము చేయుచుండుము"

వరుడు బంధుగణాన్ని ఉద్దేశించి ఒక మంత్రాన్ని చెప్తాడు

"సుమంగలీరియం వధూరిమాగ్ం సమేత పశ్యత ।
సౌభాగ్యమస్యై దత్వా యాథాస్తం విపరేతన ॥"

"మీరందరూ వచ్చి, ఈమెను చూడుడు ఈమె సుమంగలియగు వధువు మీరు ఈమెకు సౌభాగ్యము (ఆయురారోగ్యములు, సువాసినీత్వము)ను ఇచ్చి, తరువాత మీ మీ గృహములకు జనుడు"

బంధువులందరు తమ తమ మంగళదృష్టులనే వధూవరులపై ప్రసరింప

చేయాలి గాని, ఎవరైననూ అసూయాపూరితదృక్కులద్వారా వధువునకు దృష్టి దోషం కల్గునట్లు చేయుట తగదని ఈ ప్రార్థనలోని అంతరార్థము

## నక్షత్ర దర్శనము

నక్షత్రోదయం అయిన తరువాత వధూవరులను తూర్పు లేక ఉత్తరం వైపుకు కొంతదూరం తీసుకువెళ్ళి, పురోహితుడు వారికి ధ్రువనక్షత్రాన్ని చూపిస్తారు

"ధ్రువక్షితిర్ధ్రువయోనిర్ధ్రువమసి ధ్రువతస్థితమ్ ।
త్వం నక్షత్రాణాం మేధ్యసి స మా పాహి పృతన్యత ॥ "

''ఓ ధ్రువనక్షత్రమా ! నీ స్థానము స్థిరమైనది నక్షత్రములన్నీ నిన్ను కట్టుకొయ్యగా చేసుకుని నీచుట్టూ తిరుగుతుంటాయి నీవు మమ్ములను కలహము కోరువారి నుండి రక్షింపుము "

హిందూవివాహబంధం శాశ్వతమైనది ఈ సత్యాన్ని చాటి చెప్పే ఆచారమే ధ్రువదర్శనము ఆకాశంలో చంచలమైన అనేక నక్షత్రాలమధ్య స్థిరంగా ప్రకాశించేది ధ్రువనక్షత్రము దిక్సూచి మొదలగు సాధనాలు కనిపెట్టటానికి పూర్వం సముద్రంలో నావికులు ఈ నక్షత్రం ఆధారంగానే దిక్కులను తెలుసుకొనే వారు అట్టి ధ్రువనక్షత్రాన్ని దర్శించి, ప్రార్థించటం ద్వారా ఈ దంపతులు శాశ్వతమైన, ఆదర్శప్రాయమైన అనురాగబంధంలో బంధింపబడతారు మరియు, జీవనయాత్రలోని కష్టసుఖాల్ని మనస్థైర్యంతో ఎదుర్కొనే సంయమనం లభిస్తుంది

వివాహంలో మాత్రమే గాక, సర్వయాగారంభములందు, సాయంకాల సంధ్యావందనం అయిన తర్వాత కూడ ధ్రువమండలంలో పరబ్రహ్మను సమంత్రకంగా ఉపాసించాలని తైత్తిరీయారణ్యకంలో చెప్పబడింది ఇట్టి ఉపాసనవలన అపమృత్యువు తొలగి, సమస్తసంపదలు లభిస్తాయని ఫలశ్రుతి ఈ వధూవరులు నిత్యనైమిత్తిక కర్మానుష్ఠానం చేసి, పరిశుద్ధమైన అంతఃకరణము గలవారై, సగుణ బ్రహ్మోపాసన కూడ చేసి, ఆత్మారాములై కృతార్థులు కావాలనే ఆకాంక్ష ఈ ఆచారంలో కనబడుతుంది

ధ్రువదర్శనం తరువాత, పురోహితుడు వధూవరులకు సప్తర్షిమండలాన్ని, అరుంధతీనక్షత్రాన్ని చూపిస్తాడు వధూవరులు సమంత్రకంగా అర్ఘ్యాన్ని సమర్పించి నమస్కరిస్తారు

''సప్త ఋషయః ప్రథమాం కృత్తికానామరుంధతీం యద్ధ్రువతాగ్ంహ నిన్యుః షట్కృత్తికా ముఖ్యయోగం వహంతీయమస్మాకమేధత్వష్టమీ ॥ "

''సప్తఋషులు తమ ఏడ్గురు భార్యలతో అరుంధతిని సర్వోత్తమురాలిగా, శాశ్వతురాలిగా ఎంచిరి ఈ వధువు అదే విధముగా ఎనిమిదవ స్త్రీ యగుచు వృద్ధి పొందుగాక ! ''

ఈ మంత్రంలో రెండు ఆకాంక్షలు ధ్వనిస్తున్నాయి వరుడు సప్తర్షుల సంఖ్యలో ఎనిమిదవ వాడు కావాలి అంటే, అంతటి పవిత్రధార్మికజీవనాన్ని గడపాలి వధువు ఋషిపత్నులలో అరుంధతి తర్వాత ఎనిమిదవ స్త్రీ కావాలి అంటే, ఆమె మహాపతివ్రతలలో లెక్కించదగ్గ స్త్రీ కావాలి ఈ మంత్రాన్ని బట్టి హిందూగృహస్థజీవనంలో ధర్మంయొక్క స్థానాన్ని మనం గుర్తించవచ్చును

అరుంధతి మిక్కిలి చిన్న నక్షత్రం దీనిని చూపుట, చూడగలుగుట కూడ కొంత క్లేశముతో కూడిన పని అందుచేత, ముందుగా సప్తర్షిమండలాన్ని, దానిలో అరుంధతికి సమీపంలోని పెద్ద నక్షత్రాన్ని చూపి తర్వాత దాని ఆధారంగా మిణుకు మిణుకుమనే అరుంధతిని చూపితే, వధూవరులకు చూడటం తేలిక అవుతుంది- ఈ ప్రక్రియనే ''స్థూలారుంధతీన్యాయం'' అంటారు

వధూవరులు సప్తర్షుల నామాల్ని స్మరించి వారికి అర్ఘ్యాన్ని ఇస్తారు

"కశ్యపోఽత్రిర్భరద్వాజో విశ్వామిత్రోఽథ గౌతమః ।
వసిష్ఠో జమదగ్నిశ్చ సప్తైతే ఋషయస్తథా ॥ "

వసిష్ఠ పత్నియగు అరుంధతి కర్దమప్రజాపతి, దేవహూతుల కుమార్తె ఆమె ముల్లోకములకు పూజ్యురాలు అని భాగవతం చెప్తోంది

"ప్రజాపతేః కర్దమస్య దేవహూత్యామభూత్సుతా ।
అరుంధతీ వసిష్ఠస్య పత్న్యభూల్లోకపూజితా ॥ "

## ఆగ్నేయస్థాలీపాకము

గృహస్థ జీవనమును స్వీకరించిన వరుడు తన భావిజీవితంలో అగ్నిని ఆరాధించాలి "యావజ్జీవమగ్నిహోత్రం జుహోతి" కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ం సమాః" ఇత్యాది శ్రుతులు మనం జీవించి ఉన్నంతకాలం హవనం చేయాలని విధిస్తున్నాయి, "అగ్నిమిచ్ఛధ్వం భారతాః అంటూ అరుణోపనిషత్తుకూడా ఇదే సందేశాన్ని ఇస్తోంది అట్టి పవిత్రమైన అగ్నిని ఉపాసించే జీవనానికి నాంది పలికే కర్మయే ఆగ్నేయస్థాలీపాకము

వధువు ఒక చిన్న గిన్నెలో బియ్యం, నీళ్ళు పోసి అగ్నిహోత్రంలో వండి, హోమం కొరకు సిద్ధం చేస్తుంది ఈ హోమద్రవ్యానికి 'చరువు' అని పేరు దీనిని కొద్దికొద్దిగా చేతితో హోమసాధనమగు దర్విలోనికి తీసుకుని అజ్యాభిమారం చేసి, రెండు పర్యాయాలు వరుడు సమంత్రకంగా హోమం చేస్తాడు

అగ్నయే స్వాహా అగ్నయ ఇదం న మమ ।
అగ్నయే స్విష్టకృతే స్వాహా అగ్నయే స్విష్టకృత ఇదం న మమ

ఈ హోమాలన్నిటిలో 'ఇదం న మమ' అనే మాట వినబడుతూ ఉంటుంది దేవతలనుద్దేశించి హవిస్సును సమర్పించి, 'నేను సమర్పించిన ఈ ద్రవ్యము ఇకపై నాది కాదు' అని భావనచేయాలి నిత్యము ఈ విధంగా 'ఇదం న మమ' అని భావనచేస్తూ ఉంటే, ఆ సంస్కారము అట్టి మానవుని త్యాగస్వరూపునిగా తీర్చి దిద్ది, మోక్షసామ్రాజ్యానికి దారి సుగమం చేస్తుంది

ఆగ్నేయస్థాలీపాకం స్థాలీపాకాలన్నిటికీ ప్రకృతి దీనిలో స్విష్టకృత్' అనే గుణము కలిగిన అగ్నికి హవిస్సును సమర్పిస్తారు 'స్విష్టకృత్' అనగా ఈ వివాహంలో చేసిన హోమాలన్నిటిలో ఏమైనా దోషాలుంటే వాటిని పరిహరించువాడు అని అర్థము చరువును తయారుచేయుటలో పత్ని పతికి సహకరించి, ఆవిధంగా ధర్మాచరణంలో సహభాగిని అవుతూ ఉంటుంది హోమంచేయగా మిగిలిన చరువును దంపతులు యజ్ఞేశ్వర ప్రసాదంగా స్వీకరిస్తారు

## శేషహోమము

వివాహంలో ఇది ఆఖరి హోమం అందుచేతనే, దీనికి 'శేషహోమము' అని పేరు వధూవరులలోని సమస్తదోషాల్ని నిర్మూలించి, వారు యోగ్యులైన దంపతులు కావాలని ఈ హోమం ఉద్దేశింపబడింది వరుడు ఆవిధంగానే దేవతలను ప్రార్థిస్తూ హోమం చేస్తాడు

"అగ్నే ప్రాయశ్చిత్తే త్వం దేవానాం ప్రాయశ్చిత్తిరసి బ్రాహ్మణస్త్వానాథకామః ప్రపద్యే యాఽస్యాం పతిఘ్నీ తనూః ప్రజాఘ్నీ పశుఘ్నీ లక్ష్మిఘ్నీ జారఘ్నీ మస్యేతాం కృణోమి స్వాహా ॥" అగ్నయ ఇదం న మమ ॥

"ఓ అగ్నీ ! నీవు వినష్టమైన కర్మలను సంధానం చేసే దైవానివి నేను నిన్ను ప్రభువుగా కోరి నిన్ను శరణు పొందితిని ఈ నా భార్యకు భర్త మరణించే, సంతానము మరణించే, పశువులు నశించే, సంపత్తు నశించే అభాగ్యము కలుగకుండునట్లు అనుగ్రహింపుము "

ఇదే విధంగా వాయువు, ఆదిత్యుడు, ప్రజాపతి అనే దేవతలను కూడా వరుడు ప్రార్థించి హోమం చేస్తాడు

"మధుశ్చ మాధవశ్చ శుక్రశ్చ శుచిశ్చ నభశ్చ నభస్యశ్చేషశ్చోర్జశ్చ సహశ్చ సహస్యశ్చ తపశ్చ తపస్యశ్చ తే యం ద్విష్మో యశ్చ నో ద్వేష్టి తమేషాం జంభే దధ్మస్స్వాహా ॥ "

చైత్ర, వైశాఖ, జ్యేష్ఠ ఆషాఢ, శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ, కార్తీక, మార్గశీర్ష, పుష్య, మాఘ, ఫాల్గుణములనే మాసాల అధిదేవతలు మా శత్రువులను నశింప జేయుదురుగాక ! "

మానవునికి శత్రువులు రెండు రకాలు - బాహ్యశత్రువులు, ఆంతరశత్రువులు, ఈ మంత్రాలతో హోమం చెసే సమయంలో యజమాని కామక్రోధలోభ మోహ మద మాత్సర్యాలనే, అరిషడ్వర్గము అని ప్రసిద్ధిగాంచిన అంతరశత్రువులు నశించాలని భావన చేయాలి

హోమం అయిన తరువాత, ఆజ్యశేషంలోని ఒకటి, రెండు బిందువులను వరుడు 'భూర్భువస్సువః' అనే వ్యాహృతులను, ఓంకారాన్ని ఉచ్చరిస్తూ వధువు శిరస్సుపై ఉంచుతాడు తరువాత వధూవరులు సమంత్రకంగా ఒకరినొకరు వీక్షిస్తారు ఇతః పూర్వం వరుడు మాత్రమే వధువును వీక్షించేదు ఇపుడు వధూవరు లిద్దరూ ఒకేసారి సమంత్రకంగా పరస్పరం వీక్షిస్తారు

వధువు ఈ క్రింది మంత్రాన్ని చెప్తూ వరుణ్ణి వీక్షిస్తుంది

"అపశ్యం త్వా మనసా చేకితానం తపసో జాతం తపసో విభూతమ్ ఇహ ప్రజామిహ రయిగ్ం రరాణః ప్రజాయస్వ ప్రజయా పుత్ర కామ ॥"

"ఓయీ ః పుత్రులయందు కోరిక గలవాడా ః నీవు నా మనసెరిగి ప్రవర్తిస్తావు నీవు వేదోక్తకర్మానుష్ఠానరూపమగు తపస్సువలన జన్మించేవు అట్టి తపస్సే నీ ఐశ్వర్యము నీవలన నేను ఈ మన గృహమునందు సంతానమును, ధనమును పొందెదను నీవు నాయందు సంతానరూపముగ తిరిగి జన్మించగలవు ''

ఈ మంత్రంలో వధువు అనేక ఉదాత్తమైన భావాల్ని ప్రకటిస్తోంది ఐశ్వర్యం అంటే స్థిరచరాస్తులు మాత్రమే అని ఒక అపప్రథ సమాజంలో ఉంది వాటితోపాటు తపస్సు, వేదాధ్యయనము కూడ ఐశ్వర్యాలే మహర్షులకు 'తపోధనులు' అనే విశేషణాన్ని తరుచుగా వాడుతూ ఉంటారు నశించని ఐశ్వర్యాన్ని గురించి వేదం ఇల్లా చెప్తోంది- "ఋచస్సామాని యజూగ్ంషి ।సా హి శ్రీరమృతా సతామ్॥'' సత్పురుషులకు నశించని సంపదలు ఋగ్వేద, సామవేద, యజుర్వేదములే

పురుషుడు తానే భార్యాగర్భమునందు సంతానరూపంలో జన్మిస్తాడని వేదాలు చెప్తాయి 'జాయా' అనగా భార్య అని అర్థము ఈమెయందు పురుషుడు తిరిగి జన్మిస్తాడు, కనుకనే భార్యకు 'జాయా' అని పేరు వధువు పఠించే పై మంత్రంలో ఈ విషయమే ప్రస్తావించబడింది. వధువువిషయంలో ఇట్టి భావాలనే ప్రకటించే క్రింది మంత్రాన్ని పఠించి వరుడు వధువును వీక్షిస్తాడు

"అపశ్యం త్వా మనసా దీధ్యానాగ్ స్వాయాం తనూగ్ం

ఋత్వియే నాధమానామ్ । ఉపమాముచ్చా యువతిర్భభూయాః ప్రజా యస్యై ప్రజయా పుత్రకామే ॥"

ఆతరువాత వరుడు ఆజ్యశేషంలో బొటనవ్రేలిని, మధ్యవ్రేలిని ముంచి, బొటనవ్రేలితో తన హృదయాన్ని, మధ్యవ్రేలితో వధువు హృదయాన్ని ఏక కాలంలో స్పృశిస్తూ కొన్ని మంత్రాల్ని పఠిస్తాడు ఈ కర్మయొక్క తాత్పర్య మేమనగా— వధూవరుల హృదయాలు బాగా దగ్గర కావాలి, మరియు వారి హృద యాలు స్నేహము (నెయ్యి)తో బంధింపబడాలి వరుడీ భావాల్ని మంత్రరూపంగా వ్యక్తం చేస్తాడు

"సమంజంతు విశ్వే దేవాస్సమాపో హృదయాని నౌ।
సం మాతరిశ్వా సంధాతా సముదేష్ట్రీ దిదేష్టు నౌ॥"

"విశ్వేదేవతలు, ఉదకాధిష్ఠానదేవతలు, వాయుదేవతలు, ప్రజాపతి మన హృదయాల్ని పరస్పర ప్రేమానురాగపూర్ణములుగా చేయుగాక! మన మిద్దరము ఎల్లప్పుడు పరస్పరానుకూలమగు సంభాషణే చేయునట్లు సరస్వతి అనుగ్రహించు గాక !''

## నాకబలి

వివాహంలో ఆఖరున వధూవరుల అభ్యుచ్ఛయంకోసం జరిగే కర్మ నాకబలి అభ్యుచ్ఛయప్రధానమైన ఈ కర్మ ఏదేని తొందరలో జరుగకపోయినా, ప్రధాన సంస్కారానికి లోపం రాదు దేవతలకు చేసే పూజకే 'నాకబలి' అని పేరు గృహమధ్యంలో చతురస్రాకారముగా మట్టితో అలికి, అయిదురకాల రంగులతో, పిండితో పద్మాకారాన్ని చిత్రిస్తారు ఉత్తరదక్షిణదిక్కులయందు రెండు ఏనుగు బొమ్మల్ని చిత్రించి, పద్మమధ్యంలో గౌరీదేవిని ప్రతిష్ఠిస్తారు తూర్పున రెండు కలశలను, నాల్గు దిక్కులయందు ముప్పది మూడు నాకబలిపాత్రలను (మట్టితో చేసినవి) ఉంచుతారు చుట్టూ దారం కట్టి పుష్పాక్షతలతో అలంకరిస్తారు ఇద్దరు సువాసినీస్త్రీలు పళ్లెములలో ముప్పదిమూడు దీపాల్ని పట్టుకుంటారు ఒక వృద్ధ సువాసిని జలకుంభమును పట్టుకొనును వీరితో కలిసి పురోహితుడు, వరుడు, ఆతని చెయి పట్టుకొని వధువు వీరందరూ ఆవిధంగా అలంకృతమైన ప్రదేశాన్ని

ముమ్మారు ప్రదక్షిణం చేస్తారు ప్రదక్షిణం చేస్తూండగా "మమాగ్నే వర్చః" ఇత్యాది ఆశీర్మంత్రాల్ని పఠిస్తారు చుట్టూ దీపాల్ని అలంకరిస్తారు నాకదేవత లకు ముప్పదిమూడు అన్నకబళాలను నైవేద్యం పెడతారు

పశ్చిమదిక్కులోని దారాల్ని చాకుతో త్రెంచి, లోపల ప్రవేశించి, గౌరీ దేవిని, ఇంద్రాణీదేవిని షోడశోపచారాలతో వధూవరులు ఆరాధిస్తారు వరుడు వధూ కంఠమునందు నీలమణిసూత్రాన్ని బంధిస్తాడు అపుడు వరుడు ఈ మంత్రాన్ని పఠిస్తాడు

"నీలలోహితే భవతః కృత్యాస క్తిర్వ్యజ్యతే ।
ఏధంతేఽస్యా జ్ఞాతయః పతిర్బంధేషు బధ్యతే ॥"

ఓ చిన్నదానా! నలుపు, ఎరుపు రంగులుగల మణులతో కూడిన సూత్రాన్ని ధరించుచుంటివి దీని ప్రభావముచే నిన్ను ఇతరులెవ్వరును పరాభవింపజాలరు. నీ బంధువులు వృద్ధి పొందెదరు భర్తనగు నేను నీయందు అనురాగబద్ధుడనై ఉండగలను "

ఇంతవరకు వివాహసంస్కారముయొక్క అంగాలలో ప్రధానమైనవాటిని వివరించడమైనది ఇంతేగాక, వసన్తమాధవపూజ, దంపతిపూజ, అప్పగింతలు ఇత్యాదికమును వారి వారి దేశాచారమును, వంశాచారమును బట్టి నిర్వర్తిస్తారు

ఈవిధంగా వేదోక్తములైన అనేక అంగములతో కూడిన వివాహసంస్కారముచే సంస్కృతులైన యువతి, యువకుడు పత్ని, పతిశబ్దములకు అర్హులై గృహస్థజీవనము అనే ద్వితీయాశ్రమంలోకి అడుగిడతారు ఈ ఆశ్రమం సమస్త భోగాలను అనుభవించటానికి ఉపయోగించే 'లైసెన్సు' వంటిదిగానో, లేక తమ తమ మనసులు కలిసినంతకాలం కులాసాగా కలిసి ఉండే 'కాంట్రాక్టు' వంటిది గానో భావించుట వైదికసంస్కృతిలో కానరాదు ధర్మబద్ధమైన భోగానుభవము సమ్మతమే కాని దానితోబాటు కొన్ని ఆశ్రమధర్మాల్ని పాటించవలసిన బాధ్యత కూడ భార్యాభర్తలపై పడుతుంది

మహాభారతం ఆదిపర్వం అష్టకయయాతి సంవాదంలో ధర్మబద్ధమైన గృహస్థజీవనాన్ని నిర్దేశించే ఒక శ్లోకముగలదు దీనికి 'గృహస్థోపనిషత్' అని పేరు

ధర్మాగతం ప్రాప్య ధనం యజేత
దద్యాత్సదైవాతిథీన్ భోజయేచ్చ ।
అనాదదానశ్చ పరైరదత్తం
సైషా గృహస్థోపనిషత్ పురాణీ ॥

ధనాన్ని ధర్మమార్గంలోనే సంపాదించాలి సంపాదించిన ధనంలో కొంత భాగాన్ని దైవకార్యాలకి, దానానికి వెచ్చించాలి ఇతరుల ధనాన్ని ఎన్నడును అవహరింపరాదు ఇతరులు దానం చేసిన దానిని తీసుకోవచ్చు ఇంటికి విచ్చేసిన అతిథులను సాదరంగా సత్కరించి, భోజనసమయమైతే తప్పక వారికి భోజనాన్ని ఏర్పాటు చేయాలి అతిప్రాచీనమైన గృహస్థోపనిషత్ (గృహస్థధర్మసారరహస్యము) ఇదియే

ప్రాచీనభారతీయ జీవనము అతిథిధర్మానికి పేరెన్నికగన్నది హుయాన్ త్సాంగ్ మొదలగు విదేశీపర్యాటకులు భారతీయ గృహస్థజీవనములోని జ్వలంతమైన అతిథిధర్మాన్ని కొనియాడేరు ఇట్టి గృహస్థోపనిషత్తును ఆచరణలో పెట్టే మనోదార్ఢ్యమును దంపతులకు కలిగించుటకొరకే వివాహసంస్కారంలో అనేక అంగాలు ఉద్దేశింపబడ్డాయి ఈనాటికీ భారతీయ వివాహవ్యవస్థ, గృహస్థజీవనము పూర్తిగా కలుషితం కాలేదంటే, అది ఈ వివాహసంస్కారము యొక్క మహిమయే

భవభూతి మాటల్లో చెప్పాలంటే, పవిత్రమైన ఇట్టిదాంపత్యము చిరకాలము వర్ధిల్లాలని పరమేశ్వరుణ్ణి ప్రార్థించుట మన కర్తవ్యము

"భద్రం తస్య సుమానుషస్య
కథమప్యేకం హి తత్ప్రార్థ్యతే ।"

ఇతిశమ్

సర్వేజనాస్సుఖినోభవన్తు ।

పరమేశ్వరార్పణమస్తు

# ఉపయుక్త గ్రంథసూచి


1 కృష్ణయజుర్వేదము, విద్యారణ్య భాష్యంతో సహా

2 ఏకాగ్నికాండ, హరదత్త భాష్యంతో సహా

3 యాజుషస్మార్తానుక్రమణిక, చల్లా వారిది

4 యాజుషస్మార్తానుక్రమణిక, పర్వతం వారిది

5 సంస్కార రత్నాకరము, సన్నిధానం లక్ష్మీనారాయణ మూర్త్యవధానిగారిచే విరచితము

6 మహాభారతము, గీతా ప్రెస్



ACC No 99526
500032